ప్రతి అక్షరం - ప్రజల కోసం

# రోమింగ్ న్యూస్

తెలుగు దినపత్రిక

యాదాద్రి భువనగిరి

పేజీలు : 8
సంపుటి : 3
సంచిక : 293

సోమవారం 28 ఏప్రిల్ 2025 | చీఫ్ ఎడిటర్ : గొట్టిపర్తి భాస్కర్ | HYDERABAD, KARIMNAGAR, KHAMMAM, NALGONDA, NIZAMABAD, WARANGAL, MAHABUBNAGAR.RANGAREDDY, MEDAK, ADILABAD

## టాప్ లేపిన బెంగళూరు

ఆదుకున్న క్రునాల్, కోహ్లీ

ఢిల్లీపై ఆరు వికెట్లతో విజయం

07



# దేశ ప్రజల రక్తం మరుగుతోంది

ఉగ్రవాదులకు, కుట్రదారులకు అత్యంత కఠిన శిక్ష

కశ్మీర్‌లో శాంతియుత వాతావరణాన్ని చూసి శత్రువులు తట్టుకోలేకపోతున్నారు.. అందుకే ఇంత కుట్ర: మోదీ

యుద్ధానికి సిద్ధంగా ఉ న్నామంటూ 'ఎక్స్'లో నేవీ పోస్ట్

అరేబియా సంద్రంలో నౌకా విధ్వంసక క్షిపణి పరీక్షలు

పహల్గాం బాధిత కుటుంబాలకు న్యాయం చేసే పూచీ నాది

పహల్గాం ఉగ్రదాడి చిత్రాలు చూసి దేశంలోని ప్రతి పౌరుడి రక్తం మరుగుతోందన్న విషయం తనకు అర్థమవుతోందని.. బాధిత కుటుంబాలకు తగిన న్యాయం జరుగుతుందని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. వారికి న్యాయం చేసే పూచీ తనదని.. పర్యాటకులపై దాడికి పాల్పడ్డవారికి, దాడి వెనుక సూత్రధారులకు అత్యంత కఠిన శిక్ష విధిస్తామని మరోసారి హామీ ఇచ్చారు.

02





# మంచిగున్న రాష్ట్రాన్ని ఆగం చేస్తున్నారు

### కాంగ్రెస్ పాలన చూస్తుంటే బాధేస్తోంది..

- నంబర్-1 నుంచి 14వ స్థానానికి దిగజార్చారు..
- అంతటా కరెంటు కోతలు.. సాగునీరు లేదు
- తెలంగాణ రైతాంగం మళ్లీ దోపిడీకి గురవుతోంది
- అప్పుడూ.. ఇప్పుడూ తెలంగాణకు నం.1 విలన్ కాంగ్రెస్సే
- భూముల అమ్మకం తప్పుకాదు.. అవసరమైతేనే అమ్మాలి
- 11 ఏళ్లలో రాష్ట్రానికి బీజేపీ 11రూపాయలైనా ఇచ్చిందా?
- కేంద్ర ప్రభుత్వం 'ఆపరేషన్ కగార్'ను వెంటనే ఆపాలి
- సర్కార్‌ను మేమెందుకు పడగొడ్తం.. ప్రజలే చూసుకుంటరు
- రాష్ట్రంలో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని తెచ్చుకుందాం
- ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ రజతోత్సవ సభలో కేసీఆర్



**వరంగల్, రోమింగ్ న్యూస్:** తెలంగాణను కాంగ్రెస్ ప్రభుత్వం పాలిస్తున్న తీరును చూస్తుంటే.. తనకు బాధ కలుగుతోందని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు అన్నారు. రాష్ట్రాన్ని కాంగ్రెస్ ఆగం చేస్తుంటే తన మనసు కాలుతోందని, దుఃఖం వస్తోందని తెలిపారు. తమ హయాంలో తెలంగాణలో భూముల ధరలు పెంచితే ఇప్పుడు దారుణంగా పడిపోయాయన్నారు. ఎక్కడ చూసినా కరెంటు కోతలే ఉన్నాయని, ప్రజలకు తాగునీరు, పంటలకు సాగునీరు అందడం లేదని, తెలంగాణ రైతాంగం మళ్లీ దోపిడీకి గురవుతోందని

మిగతా 2 లో

## సామాజిక కోణంలోనే నక్సలిజాన్ని చూస్తాం

శాంతిభద్రతల అంశంగా పరిగణించం

శాంతి చర్చల కమిటీతో భేటీలో సీఎం



**హైదరాబాద్, రోమింగ్ న్యూస్:** నక్సలిజాన్ని తమ ప్రభుత్వం సామాజిక కోణంలో మాత్రమే చూస్తుందని, శాంతిభద్రతల అంశంగా పరిగణించబోదని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం శాంతి చర్చలు జరిపేలా చొరవ తీసుకోవాలని, కాల్పుల విరమణకు కేంద్రాన్ని ఒప్పించాలని కోరుతూ.. శాంతిచర్చల

మిగతా 2 లో

## దక్షిణంలోనూ అధికారంలోకి వస్తాం

అభివృద్ధే ధ్యేయంగా మోదీ పాలన

అంబేడ్కర్ ఆశయాలే స్ఫూర్తి: కిషన్ రెడ్డి



**విజయవాడ, రోమింగ్ న్యూస్:** అభివృద్ధే ధ్యేయంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ పనిచేస్తున్నారని, దక్షిణ భారతదేశంలో కూడా బీజేపీ అధికారంలోకి వస్తుందని కేంద్రమంత్రి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు

మిగతా 3 లో

## ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా రామకృష్ణారావు..



03

- స్మితా సభర్వాల్‌పై వేటు..
- అప్రాధాన్య పోస్టుకు బదిలీ..
- భారీగా ఐఏఎస్‌ల బదిలీలు
- ఈ ఏడాది ఆగస్టు వరకు పదవీ కాలం
- జయేశ్‌రంజన్‌కు కీలక బాధ్యతలు..
- పరిశ్రమల పెట్టుబడుల సెల్‌కు సీఈవో
- మిస్ వరల్డ్ పోటీల బాధ్యత కూడా..
- కుటుంబ సంక్షేమ కమిషనర్‌గా సంగీత సత్యనారాయణ



## మనసంతా విషాన్ని నింపుకొన్న కేసీఆర్..

తెలంగాణ ఇచ్చినందుకు కాంగ్రెస్ విలనా

సోనియాకు సాష్టాంగ నమస్కారం మరిచారా?


కాంట్రాక్టర్లకు బకాయిలు, సర్పంచ్‌లకు బాకీలు కేసీఆర్ హయాంలో పెట్టినవే..

03

- మేం ఇబ్బంది పెట్టాలనుకుంటే సభ జరిగేదేనా?: మంత్రి పొంగులేటి
- నియంతలా కేసీఆర్ మాటలు: సీతక్క
- సోనియాగాంధీ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేయాలి: పొన్నం
- కేసీఆర్‌లో ఇంకా గర్వం పోలేదు: జూపల్లి

## కర్రెగుట్టల్లో భారీ గుహ

- సేఫ్‌జోన్‌గా వినియోగించిన నక్సల్స్
- అర కి.మీ పొడవు.. సహజ నీటివనరులు
- వెయ్యి మంది ఉండేందుకు అనుకూలం
- బియ్యం, నిత్యావసర వస్తువుల గుర్తింపు
- కర్రెగుట్టల్లో వందల గుహలు: ఆదివాసీలు



03

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
28 ఏప్రిల్
2025






# దేశ ప్రజల రక్తం మరుగుతోంది

**ఉగ్రవాదులకు, కుట్రదారులకు అత్యంత కఠిన శిక్ష**

**కశ్మీర్‌లో శాంతియుత వాతావరణాన్ని చూసి శత్రువులు తట్టుకోలేకపోతున్నారు.. అందుకే ఇంత కుట్ర: మోదీ**

**యుద్ధానికి సిద్ధంగా ఉన్నామంటూ 'ఎక్స్'లో నేవీ పోస్ట్**

**అరేబియా సంద్రంలో నౌకా విధ్వంసక క్షిపణి పరీక్షలు**

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 27 :** పహల్గాం ఉగ్రదాడి చిత్రాలు చూసి దేశంలోని ప్రతి పౌరుడి రక్తం మరుగుతోందన్న విషయం తనకు అర్థమవుతోందని.. బాధిత కుటుంబాలకు తగిన న్యాయం జరుగుతుందని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. వారికి న్యాయం చేసే పూచీ తనదని.. పర్యాటకులపై దాడికి పాల్పడ్డవారికి, దాడి వెనుక సూత్రధారులకు అత్యంత కఠిన శిక్ష విధిస్తామని మరోసారి హామీ ఇచ్చారు. 'మన్ కీ బాత్' 121వ ఎపిసోడ్‌లో ఈ అంశాన్ని ప్రధానంగా ప్రస్తావించి విచారాన్ని వ్యక్తం చేసిన ప్రధాని.. దేశ ప్రజలందరి హృదయాలనూ ఉగ్రదాడి తీవ్రంగా బాధించిందని చెప్పారు. ఈ దాడిలో తమవారిని కోల్పోయిన బాధితుల ఆవేదనను.. రాష్ట్రాలకు, భాషలకు అతీతంగా దేశంలోని ప్రతి ఒక్కరూ అనుభవిస్తున్నారని, ఈ క్రూర దాడిని ముక్తకంఠంతో నిరసిస్తున్నారని వ్యాఖ్యానించారు. "జమ్ముకశ్మీర్‌లో మళ్లీ శాంతియుత వాతావరణం నెలకొంటోంది. పాఠశాలలు, కళాశాలలు తెరుచుకుంటున్నాయి. మునుపెన్నడూ లేని విధంగా నిర్మాణ పనులు ఊపందుకుంటున్నాయి. ప్రజాస్వామ్యం బలోపేతమై, పర్యాటకుల సంఖ్య రికార్డు స్థాయిలో పెరుగుతోంది. ప్రజల ఆదాయం పెరుగుతోంది. యువతకు కొత్త అవకాశాలు లభిస్తున్నాయి. దేశ శత్రువులు, కశ్మీర్ శత్రువులకు ఇదంతా నచ్చట్లేదు. వారి దీన్ని చూసి ఓర్వలేకపోతున్నారు. ఉగ్రవాదులు, వారి వెనుక ఉండే సూత్రధారులు కశ్మీర్ మరోసారి నాశనం కావాలనుకుంటున్నారు. అందుకే ఇంత పెద్ద కుట్రకు తెగబడ్డారు." అని ప్రధాని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఉగ్రవాదాన్ని పెంచి పోషించేవారి పిరికితనానికి ఈ దాడి నిదర్శనమని వ్యాఖ్యానించారు.

"ఉగ్రవాదంపై మనం జరుపుతున్న పోరులో.. దేశ ప్రజల ఐకమత్యం, 140 కోట్ల మంది భారతీయుల సంఘీభావమే మనకున్న అతి పెద్ద బలం, ఉగ్రవాదంపై మన నిర్ణయాత్మక పోరాటానికి ఈ ఐక్యతే ఆధారం" అని మోదీ పేర్కొన్నారు. ఈ సమయంలో ఒక దేశంగా మనందరం బలమైన సంకల్పశక్తిని ప్రదర్శించాలని పిలుపునిచ్చారు. ఈ ఉగ్రదాడి తర్వాత.. దేశప్రజలందరూ ముక్తకంఠంతో మాట్లాడడాన్ని ప్రపంచమంతా ఆసక్తిగా గమనిస్తోందని చెప్పారు. వివిధ దేశాల నేతలు తనకు ఫోన్ చేసి మాట్లాడారని, లేఖలు రాశారని, సందేశాలు పంపారని.. అందరూ ఈ నీచమైన దాడాని తీవ్రంగా ఖండించారని, బాధితుల కుటుంబాలకు సానుభూతి తెలిపారని మోదీ వెల్లడించారు.


### యుద్ధానికి సిద్ధం.. కాల్పులు.. కూల్చివేతలు..

పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో పాక్ 'అణు'బీరాలు పలుకుతున్న వేళ.. భారత నౌకాదళం అరేబియా సంద్రంలో మన యుద్ధనౌకల సన్నద్ధతను మరోసారి పరీక్షించుకుంది. యుద్ధనౌకల నుంచి.. పలు నౌకా విధ్వంసక క్షిపణులను విజయవంతంగా ప్రయోగించింది. సముద్ర జలాల్లో ఎక్కడైనా, ఎప్పుడైనా, ఎలాగైనా దేశ ప్రయోజనాలను కాపాడేందుకు సిద్ధంగా ఉన్నామంటూ నౌకాదళం 'ఎక్స్' వేదికగా ఒక ప్రకటన విడుదల చేసింది. ఐక్యతలోనే బలం ఉందని మరో పోస్టులో పేర్కొంది. భారత సైన్యం కూడా.. "ఎల్లప్పుడూ సిద్ధం, నిరంతరం అప్రమత్తం" అంటూ ఒక పోస్టు చేసింది. మరోవైపు.. కశ్మీర్‌లో ఉగ్రవాదుల కోసం తనిఖీలు, ఉగ్రవాదుల ఇళ్ల కూల్చివేతలు కొనసాగుతున్నాయి. గడిచిన ఆరు రోజుల్లో మన భద్రతా దళాలు 10 మంది ఉగ్రవాదుల ఇళ్లను కూల్చిపారేశాయి. జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదుల నెట్‌వర్క్‌ను సమూలంగా నాశనం చేసేందుకే ఈ సోదాలు, కూల్చివేతలను కొనసాగిస్తున్నట్టు పోలీసు శాఖ అధికార ప్రతినిధి వెల్లడించారు. ఇక.. నియంత్రణ రేఖ వద్ద పాక్ కవ్వింపు కాల్పులు కొనసాగుతూనే ఉన్నాయి. వాటికి మన సైన్యం దీటుగా బదులిస్తోంది.

### 48 గంటల్లోగా కోతలు పూర్తిచేయండి

పహల్గాం ఉగ్రదాడితో భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో.. నియంత్రణ రేఖకు ఆనుకుని ఉన్న పొలాలన్నింటిలో పంట కోతలు 48 గంటల్లోగా (సోమవారం సాయంత్రంలోగా) పూర్తిచేసి, వాటిని ఖాళీ చేయాలని భారత సరిహద్దు భద్రత దళాలు రైతులను శనివారం సాయంత్రం ఆదేశించినట్టు సమాచారం. పంజాబ్ సెక్టార్‌లో 530 కిలోమీటర్ల మేర విస్తరించిన ఇండో-పాక్ అంతర్జాతీయ సరిహద్దుపై ఉన్న జీరోలైన్‌కు, భారత్ వైపు ఉన్న సరిహద్దు కంచెకు నడుమ.. రైతులకు దాదాపు 45 వేల ఎకరాల సాగుభూములున్నాయి. వారంతా అక్కడ గోధుమలు పండిస్తుంటారు. తాజా పరిస్థితుల నేపథ్యంలో ఆయా పొలాల్లో కోతలు రెండు రోజుల్లోగా పూర్తిచేయాలంటూ అమృత్‌సర్, ఫిరోజ్‌పూర్, ఫజిల్కా తదితర జిల్లాల్లోని గ్రామ గురుద్వారాలు ప్రకటనలు చేస్తున్నాయి. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగితే.. ఆ పొలాలకు వెళ్లేందుకు ఉపయోగించే మార్గాలను (యాక్సెస్ గేట్స్) కూడా త్వరలో మూసేసే అవకాశాలున్నాయని హెచ్చరిస్తున్నాయి. చొరబాటుదారులకు ఆ పొలాలు మరుగు (కవర్)గా ఉపయోగపడే ప్రమాదం ఉన్న నేపథ్యంలోనే బీఎసఎఫ్ ఈ ఆదేశాలు జారీ చేసినట్టు సమాచారం. అయితే, అధికారులు ఈ ఆదేశాలను మౌఖికంగా జారీచేశారని పంజాబ్ సరిహద్దు ప్రాంత రైతు సంఘం ఉపాధ్యక్షుడు సూర్జిత్ సింగ్ తెలిపారు. ఇప్పటికే ఆ పొలాల్లో 80-90 శాతం మేర కోతలు పూర్తయ్యాయని, రెండు రోజుల వ్యవధిలో మిగిలిన కోతలు పూర్తిచేసి, పశువులకు అవసరమైన గడ్డి తీసుకెళ్లడం కష్టమేనని ఆయన పేర్కొన్నారు.

# మంచిగున్న రాష్ట్రాన్ని ఆగం చేస్తున్నారు




మొదటి పేజీ తరువాయి


ఆవేదన వ్యక్తం చేశారు. తాము గుడిసెలు వేసుకున్న పేదలకు పట్టాలు ఇస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రా పేరుతో పేదల ఇళ్లను కూలగొడుతోందని మండిపడ్డారు. ఏడాదికి రూ.10 నుంచి రూ.15 వేల కోట్ల ఆదాయాన్ని తాము పెంచితే.. రాష్ట్రాన్ని దివాలా తీయిస్తున్నారని, అవివేకంతో నాశనం చేశారని ఆరోపించారు. పదేళ్లలో రాష్ట్రాన్ని తాము అద్భుతంగా తీర్చిదిద్దితే.. ఒక్క ఏడాదిలోనే పరిస్థితి అంతా తలకిందులైందని వ్యాఖ్యానించారు. 'కేసీఆర్ పక్కకు పోగానే ఇంత ఆగమైతదా?' అని ప్రశ్నించారు. కేంద్రంలోని బీజేపీ 11 ఏళ్లలో తెలంగాణకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. మావోయిస్టులను ఏరివేసేందుకంటూ చేపట్టిన 'ఆపరేషన్ కగార్'ను వెంటనే ఆపాలని, ప్రజాస్వామ్యానికి అవకాశమిస్తూ నక్సలైట్లతో చర్చలు జరపాలని అన్నారు. ఆదివారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించిన బీఆర్ఎస్ రజతోత్సవ సభలో కేసీఆర్ మాట్లాడారు. కాంగ్రెస్ పాలనపై తీవ్ర విమర్శలు చేశారు. తెలంగాణకు ఎప్పుడూ నంబర్‌వన్ విలన్ కాంగ్రెస్ పార్టీయేనని, మోసపూరితమైన హామీలతో అధికారంలోకి వచ్చి రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధిని దెబ్బతీసిందని అన్నారు.

### శ్రీరామచంద్రుని స్ఫూర్తితో..

"కన్నతల్లిని, జన్మభూమిని మించిన స్వర్గం ఏదీ లేదన్న శ్రీరామచంద్రుని స్ఫూర్తితో.. దిక్కుతోచని స్థితిలో, ఆత్మహత్యలకు ఆలవాలమై, వలసలకు నిలయమై, వలసవాదుల విషకౌగిలిలో చిక్కి నలిగిపోతున్న తెలంగాణ రాష్ట్రాన్ని విముక్తి చేయాలని, స్వరాష్ట్రం సాధించాలని నేను ఒక్కడిగా బయలుదేరిన. తెలంగాణ ఉద్యమానికి శ్రీకారం చుట్టిన. 25 ఏళ్ల క్రితం ఈ గులాబీ జెండా ఎగిరింది. ఈ జెండాను ఎందరో అవమానపరిచారు. అవహేళన చేశారు. అనేక త్యాగాలతో, ఆత్మ బలిదానాలతో ఎగిరిన జెండా... ఉద్యమ తరంగమై ఎగిసిపడింది. ఒకదశలో బరిగీసి.. బిడ్డా నా తెలంగాణను అక్కడ పెట్టు అని నిలబడినం. తద్వారా తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నాం. ప్రజలు దీవిస్తే పదేళ్ల పాటు ధగధగలాడే తెలంగాణను తయారుచేసినం. 25 ఏండ్ల సుదీర్ఘ చరిత్రతో ఈ వరంగల్ గడ్డమీద రజతోత్సవ సభను జరుపుకొంటున్నాం" అని కేసీఆర్ అన్నారు. 60 ఏండ్ల సమైక్య పాలనలో తెలంగాణ.. వేదనకు, దుఃఖం, హింస, అణవేతకు గురైందని, ఆనాడు కాంగ్రెస్, టీడీపీలో ఉన్న ఇక్కడి నేతలు.. పదవుల కోసం పెదవులు మూసుకున్నారే తప్ప.. ఏనాడూ నోరు తెరిచి మాట్లాడలేదని, గులాబీ జెండా ఎగిరేదాకా సోయిని ప్రదర్శించలేదని ధ్వజమెత్తారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో శాసనసభలో.. తెలంగాణ పదాన్ని నిషేదించారని తెలిపారు. ఆనాడైనా, ఈనాడైనా తెలంగాణకు విలన్ నెంబర్‌వన్ కాంగ్రెస్ పార్టీయేనని కేసీఆర్ అన్నారు. "తెలంగాణ హైదరాబాద్ రాష్ట్రంలో ఉన్నప్పుడు బలవంతంగా ఆంధ్రాలో విలీనం చేసింది కాంగ్రెస్ పార్టీ.. జవహర్‌లాల్ నెహ్రూ ప్రభుత్వం. 1969లో ఉద్యమం వస్తే.. 400 మంది తెలంగాణ బిడ్డల్ని పిట్టల్లా కాల్చి చంపింది ఆనాడు ఉన్న ఇందిరాగాంధీ ప్రభుత్వం. మళ్లీ 2001 నుంచి మనం విజృంభిస్తే మళ్లీ ఇదే కాంగ్రెస్ పార్టీ 14 ఏళ్లు ఏడిపించింది. నా నిరాహార దీక్ష, ప్రజల



భయంకరమైన పోరాటం కారణంగా రాజకీయ అవసరాల కోసం ఇష్టం లేకపోయినా తెలంగాణ ఇచ్చింది" అని కేసీఆర్ వివరించారు.

### అధికారాన్ని బాధ్యతగా తీసుకున్నాం..

ప్రజలిచ్చిన అధికారాన్ని పదవులు అనుభవించడానికి కాకుండా.. బాధ్యతగా తీసుకున్నామని కేసీఆర్ అన్నారు. ఎక్కడున్న తెలంగాణను ఎక్కడికి తీసుకెళ్లామో ప్రజలకు తెలుసునని, అనేక రంగాల్లో అవార్డులు వచ్చాయని, అద్భుతాలు సృష్టించామని తెలిపారు. అబద్ధాలు చెప్పడంలో కాంగ్రెసను మించినోడు లేడని, ఇక్కడున్నోళ్లు చాలరన్నట్లుగా డూప్లికేట్ గాంధీలు ఢిల్లీ నుంచి దిగివచ్చి చప్పట్లు కొట్టి డ్యాన్యులు చేశారని విమర్శించారు. రైతుబంధు, పింఛన్లు పెంచుతామని మోసం చేశారని, ఆడపిల్లలు స్కూటీలు, విద్యార్థులకు రూ.5 లక్షల బ్యాంకు గ్యారెంటీ కార్డులు, కల్యాణలక్ష్మికి అదనంగా తులం బంగారం, పంటలకు రూ.500 బోనస్, రూ.2 లక్షల రుణమాఫీ.. ఇలా 420 హామీలు ఇచ్చి ఎగ్గొట్టారని మండిపడ్డారు. ఉచిత బస్సు పథకం పెడితే.. మహిళలు జుట్లు పట్టుకొని కొట్టుకునేందుకే ఉపయోగపడుతోందన్నారు. కాంగ్రెస్ నేతలు తమపై అడ్డగోలుగా విమర్శలు చేస్తున్నారని కేసీఆర్ మండిపడ్డారు. "మా అంత సిపాయిలు లేరని చెబితే.. జనం నమ్మిండ్లు, బోల్తా పడ్డరు. గల్లంతైండ్లు. ప్రజలను దగాచేసి, మంచిగున్న తెలంగాణను ఆగం చేసిండ్లు" అని ధ్వజమెత్తారు. పేదలన్నాక ఎక్కడో ఒకచోట గుడిసెలు వేసుకుంటారని, చిన్నగా ఇళ్లు కట్టుకుంటారని కేసీఆర్ అన్నారు. అలాంటి వారిని గుర్తించి తాము లక్షలాది ఇంటి పట్టాలు ఇస్తే ఇపుడు హైడ్రా పేరుతో పేదల ఇళు కూలగొట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలోనే తెలంగాణను నంబర్‌వన్ స్థాయికి తాము తీసుకెళితే.. ఇప్పుడు 14వ స్థానానికి దిగజార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగా వచ్చిన వారికి సమయం ఇవ్వాలనే తాను ఇన్నాళ్లూ మాట్లాడలేదని, ఇక అడగాల్సిన సమయం వచ్చిందని అన్నారు. భూముల అమ్మకం తప్పు కాదని, ప్రజలకు మేలు చేసేందుకు అమ్మవచ్చునని, కానీ.. ఏది అమ్మాలో, ఏది అమ్మకూడదు అనే విచక్షణ ఉండాలని కేసీఆర్ హితవు పలికారు. యూనివర్సిటీ భూములను ఎలా అమ్మేస్తారని మండిపడ్డారు. మంచి పథకాలను ఏ నాయకుడు పెట్టినా కొనసాగించాలని, కేసీఆర్ కిట్‌ను ఎందుకు బంద్ చేశారని ప్రశ్నించారు.

### పోలీసులూ.. మీ డైరీలో రాసుకోండి..

పోలీసులకు రాజకీయాలెందుకని కేసీఆర్ ప్రశ్నించారు. మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తుందని, ఈ విషయాన్ని పోలీసు మిత్రులు తమ డైరీల్లో రాసుకోవాలని అన్నారు. బీఆర్ఎస సోషల్ మీడియా సైన్యంపై అడ్డగోలుగా కేసులు పెట్టి అరెస్టు చేయడాన్ని మానుకోవాలని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 20-30 శాతం కమీషన్లు తీసుకుంటోందని కేసీఆర్ ఆరోపించారు. స్వయంగా ఆర్థికమంత్రి వద్దకు వెళ్లిన కాంట్రాక్టర్లే ఈ విషయం చెబుతున్నారని అన్నారు. "కేసీఆర్.. అసెంబ్లీకి రా.. అంటున్నరు. పిల్లలు అడిగితేనే జవాబు చెప్పడంలేదు. 20 శాతం కమీషన్ తీసుకుంటున్నరని కేటీఆర్ అనగానే.. ఆర్థిక మంత్రి భుజాలు తడుముకున్నారు. అసెంబ్లీలో పెద్ద గోల పెడుతున్నారు" అని కేసీఆర్ వ్యాఖ్యానించారు.

### ఆపరేషన్ కగార్ ఆపాలి..

కేంద్రంలో 11 ఏళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ తెలంగాణకు 11 రూపాయలైనా ఇచ్చిందా? అని కేసీఆర్ ప్రశ్నించారు. ఒక్క ప్రాజెక్టుకైనా జాతీయ హోదా ఇచ్చారా? అని నిలదీశారు. పైగా తెలంగాణను ఉద్దేశించి ప్రధాని మోదీ ఎన్నోసార్లు తల్లిని చంపి బిడ్డను బతికించారంటూ వ్యాఖ్యానించారని విమర్శించారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో ఛత్తీసగఢ్‌లో యువకులను, గిరిజనులను ఊచకోత కోస్తోందని, ఇది ధర్మం కాదని అన్నారు. బలముందని చంపుకొంటూ వెళ్లడం సమంజసం కాదన్నారు. ప్రభుత్వంతో చర్చలు జరపడానికి సిద్ధంగా ఉన్నామని మావోయిస్టులు ప్రతిపాదన పెడుతున్నారని, ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేసి.. ప్రజాస్వామ్యానికి అవకాశమిస్తూ మావోయిస్టులతో చర్చలు జరపాలని సూచించారు. ఈ మేరకు సభలో తీర్మానం పెడుతున్నానని, చప్పట్లతో ఆమోదం తెలపాలని సభికులను కోరారు. "మీ ఆమోదాన్నే తీర్మానంగా భావించి కేంద్రానికి లేఖ పంపుతాం" అని అన్నారు. "కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే.. ఇంత పెద్దసంఖ్యలో సభకు కదలి వచ్చారంటే.. మీరు కూడా ఒక నిర్ణయానికి వచ్చారని అర్థమవుతోంది. అందరూ ధైర్యంగా ఉండండి. మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని తెచ్చుకుందాం. చిరునవ్వులు చిందించే తెలంగాణను తయారుచేసుకుందాం" అని అన్నారు.

### ప్రభుత్వాన్ని మేమెందుకు పడగొడతాం?

"మీ ప్రభుత్వాన్ని మేమెందుకు పడగొడతాం? అలాంటి కిరికిరి పనులు మేం చేయబోం. ప్రజలు మీకు ఓట్లేశారు. ఆశించిన విధంగా పనిచేయకపోతే.. వారే వీపులు సాపు చేస్తారు" అని కేసీఆర్ వ్యాఖ్యానించారు. కేసీఆర్ ప్రసంగిస్తున్న సమయంలో వేదిక ముందున్న కార్యకర్తలు సీఎం.. సీఎం అంటూ నినాదాలు చేయడంతో ఆయన చిరాకుపడ్డారు. ప్రసంగాన్ని ఆటంకపరుస్తున్నారంటూ వీళ్లు మన కార్యకర్తలేనా? అని కోపగించుకున్నారు. సాయంత్రం 6.58 గంటలకు ప్రసంగం ప్రారంభించిన కేసీఆర్ 7.58 గంటలకు ముగించారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు స్వాగతోపన్యాసం చేయగా.. కేసీఆర్ ఒక్కరే రజతోత్సవ సభలో ప్రసంగించారు. ప్రసంగం మొత్తంలో కాంగ్రెస్‌పై విమర్శలు తప్ప.. సీఎం రేవంత్‌రెడ్డి పేరునుగానీ, ఇతర నేతల పేర్లను గానీ ప్రస్తావించలేదు. కేసీఆర్ ప్రసంగానికి ముందు.. కశ్మీర్‌లో ఇటీవల ఉగ్రవాదుల దాడిలో మృతిచెందిన వారి ఆత్మశాంతి కోసం సభ రెండు నిమిషాలు మౌనం పాటించింది.

# సామాజిక కోణంలోనే నక్సలిజాన్ని చూస్తాం


మొదటి పేజీ తరువాయి


కమిటీ చైర్మన్ జస్టిస్ చంద్రకుమార్, వైస్ చైర్మన్లు జంపన్న అలియాస్ జి.నర్సింహారెడ్డి, ప్రొఫెసర్ హరగోపాల్, నేతలు ఆదివారం సాయంత్రం సీఎంను కలిశారు. పలు అంశాలతో కూడిన వినతిపత్రాన్ని సీఎంకు అందించారు. దీనిపై మంత్రులతోనూ చర్చించి నిర్ణయం తీసుకుంటానని రేవంత్ చెప్పా రు.

గతంలో నక్సలైట్లతో చర్చలు జరిపిన అనుభవం సీనియర్ నేత జానారెడ్డికి ఉందని, దీనిపై ఆయన సలహాలు, సూచనలు తీసుకుంటామని వెల్లడించారు. మావోయిస్టులు శాంతి చర్చలకు వస్తామని



ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని, నక్సలైట్ల వైపు నుంచి ఎలాంటి హింసాత్మక చర్యలూ లేనంతవరకూ రాష్ట్ర పోలీసు విభాగం నుంచి ఎలాంటి ఇబ్బందులు ఉండవని.. ఆయన తెలిపినట్టు సమాచారం. కాగా, మావోయిస్టులైనా, పోలీసులైనా, గిరిజనులు, ఆదివాసీ లు, ఇలా ఎవరైనా.. ప్రాణం విలువ గొప్పదని, ప్రాణం పోతే తీసుకురాలేమని.. ప్రాణాలు కాపాడడానికి ప్రయత్నం చేయాలని.. సీఎంను కోరినట్టు చంద్రకుమార్ తెలిపారు. తమ విజ్ఞప్తులకు ఆయన సానుకూలంగా స్పందించారని చెప్పారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
28 ఏప్రిల్
2025





## గ్లోబల్ బిజినెస్ అవార్డు అందుకున్న కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి




హైదరాబాద్ బ్యూరో, ఏప్రిల్ 27 (దక్షిణాది) విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి విద్యను అందిస్తూ భారతీయ విద్యావిధానానికి దిక్సూచిలా మారినందుకు, పర్యావరణ పరిరక్షణ మరియు విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధికి విశేష కృషి చేస్తున్న లోటస్ ల్యాబ్ విద్యాసంస్థల అధినేత లయన్ కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి గ్లోబల్ బిజినెస్ అవార్డు అందుకున్నారు. లకడీకాపూల్‌లోని రెడ్ హిల్స్‌లో గల ఫ్యాప్సీ కార్యాలయంలో ఆదివారం అత్యంత ఘనంగా జరిగిన కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని డాక్టర్ గోపాల్ రెడ్డికి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి గ్లోబల్ బిజినెస్ చైర్మన్ కడారి శ్రీధర్ అధ్యక్షత వహించగా ప్రముఖ సీఏ హనుమాండ్లు పాల్గొన్నారు. లోటస్ ల్యాబ్ విద్యాసంస్థలు విద్యార్థులకు అందిస్తున్న ఉన్నత ప్రమాణాల విద్య, పర్యావరణ పరిరక్షణ పట్ల చూపుతున్న నిబద్ధత, అలాగే వారి నైపుణ్యాభివృద్ధికి చేస్తున్న డాక్టర్ గోపాల్ రెడ్డి కృషిని నిర్వాహకులు కొనియాడారు. మరిన్ని విజయాలు సాధించాలని వారు ఆకాంక్షించారు. అంతేకాకుండా లయన్ కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి దేశం గర్వించ దగ్గ రీతిలో టాక్స్ పే చేస్తూ ఆదర్శంగా నిలిచినందుకు గాను గ్రేట్ ఇండియన్ టాక్స్ పేయర్ అవార్డును కూడా అందుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ గోపాల్ రెడ్డి ఆనందం వ్యక్తం చేస్తూ, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతమైన పౌరులుగా పన్నులు చెల్లించాలని ఆకాంక్షించారు.

# యాదగిరిగుట్టలో భక్తుల సందడి

## ధర్మదర్శనానికి 2 గంటలు.. స్పెషల్ దర్శనానికి అరగంట సమయం

యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. సమ్మర్ హాలిడేస్ రావడంతో రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. రద్దీతో దర్శన, ప్రసాద క్యూలైన్లు, ప్రధానాలయ ప్రాంగణంలో సందడి కనిపించింది. దీంతో స్వామివారి దర్శనానికి రెండు గంటలు, స్పెషల్ దర్శనానికి అరగంట సమయం పట్టింది. మరోవైపు ఆలయంలో నిర్వహించిన నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, సుదర్శన నారసింహ హోమంలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఇదిలా ఉండగా ఆలయంలో నిత్య పూజలు శాశ్వతంగా జరిగాయి. ఉదయం సుప్రభాతంతో మొదలై రాత్రి పవళింపు సేవలో ముగిశాయి. భక్తులు జరిపించిన నిత్య పూజలు, నిత్య కైంకార్యాల ద్వారా ఆదివారం ఆలయానికి రూ.34,93,088 ఆదాయం వచ్చింది. ప్రసాద విక్రయం ద్వారా రూ.15,00,030, కొండపైకి వాహనాల ప్రవేశంతో రూ.4,67,500, వీఐపీ దర్శనాల ద్వారా రూ.5.40 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఆఫీసర్లు వెల్లడించారు.



**నారసింహుడి సేవలో పలువురు ప్రముఖులు**

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్, ఎమ్మెల్సీ సుంకరి రాజు వారి వారి ఫ్యామిలీలతో కలిసి గర్భగుడిలో స్వయంభూ నారసింహుడిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనం అనంతరం ఆశీర్వచన మండపంలో అర్చకులు వారికి వేదాశీర్వచనం చేయగా.. ఆలయ అధికారులు లడ్డూప్రసాదం, స్వామివారి శేషవస్త్రాలు అందజేశారు.





## వక్ఫ్ చట్టంవల్ల నిజమైన ముస్లిం పేదలకు న్యాయం

రచ్చ శ్రీనివాస్



ఆత్మకూరు (ఎం), రోమింగ్ న్యూస్: వక్ఫ్ బోర్డు సవరణ చట్టంపై ఆత్మకూరు మండల కేంద్రం మండల అధ్యక్షుడు గజరాజు కాశినాథ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమం జనజాగరణ అభియాన్ లో బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రచ్చ శ్రీనివాస్ మాట్లాడుతూ. ఒక్క తెలంగాణలోనే వేలాది మంది వక్ఫ్ బాధితులున్నారు వక్ఫ్ ముస్లింలకు వ్యతిరేకం కాదు. 40 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ సంస్కారం కోల్పోయింది. ఇది బాధితుల కన్నీళ్లకు పరిష్కారం కోసం తెచ్చిన చట్టం. మసీదులు దేవాలయాల కమిటీలు వేరు చారిటబుల్ ట్రస్ట్ లు వేరు. చారిటబుల్ ట్రస్ట్ లలో ఏ మతం కులం వారైనా ఉండవచ్చు. వక్ఫ్ బోర్డు వారి జీవితాలు మార్చడం లేదు. కొద్దిమంది జల్సాలకు ఈ బోర్డుకింద ఉన్న భూములు ఉపయోగపడుతున్నాయి.

80 శాతం ముస్లింలు వక్ఫ్ బోర్డు ఆస్తులు బయటికి తీయాలి.. పేదలకు పంచాలి అని కోరుతున్నారు. 20 ఏళ్ల పాటు వక్ఫ్ బోర్డు భూమి మీద నిర్ణయం తీసుకోకపోతే అది అన్యాయం కాదా న్యాయమూర్తులు మీరు కూడా ఆలోచన చేయండి. ఈ కార్యక్రమంలోపాల్గొన్న వారు జిల్లా ఫోక్ పర్సన్ బొబ్బల ఇంద్రారెడ్డి ఎస్సీ మోర్చా మండల పార్టీ అధ్యక్షులు మేడి సాగర్ భూత అధ్యక్షులు లోడ్ వెంకటయ్య యాస వెంకట్ రెడ్డి లోడి బద్రి రాగటి మచ్చ గిరి మెట్టు కృష్ణారెడ్డి మండల నాయకులు సాయి రెడ్డి చంద్రారెడ్డి బూడిది నరసింహ బబ్బురి శివలింగం ఆకుల సత్తయ్య గజ్జెల్లి మధు స్వప్నవిస్ నరసింహారావు కోరే లక్ష్మణ్ బీజేవైఎం నాయకులు బొజ్జ పవన్ పసుల మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు

# దేశం శోకంలో ఉంటే బీఆర్ఎస్ రజతోత్సవాలా..?

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఉట్కూరి అశోక్ గౌడ్, రాష్ట్ర కార్యదర్శి జయశ్రీ



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: జమ్మూ కశ్మీర్ లో టూరిస్టులపై ఉగ్రవాదులు జరిపిన మారణకాండతో యావత్ దేశం మొత్తం శోకసంద్రంలో ఉంటే.. రాష్ట్రంలో మాత్రం రజతోత్సవాల పేరుతో బీఆర్ఎస్ సంబరాలు చేసుకోవడం విడ్డూరంగా ఉందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఉట్కూరి అశోక్ గౌడ్, రాష్ట్ర కార్యదర్శి జయశ్రీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం యాదగిరిగుట్ట మండలం మైలారుగూడెం గ్రామంలో ఆలేరు అసెంబ్లీ బీజేపీ మండల, పట్టణ అధ్యక్షులతో నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మిగులు బడ్జెట్ తో ఏర్పడిన రాష్ట్రాన్ని పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ అప్పుల ఊబిలో పడేసిందన్నారు. రాష్ట్ర సంపదను కొల్లగొట్టి కోట్ల రూపాయలు వెనకేసుకున్న కేసీఆర్.. రాష్ట్రాన్ని మాత్రం అప్పులపాలు చేశారని ఆరోపించారు. రాష్ట్రాన్ని ఆగం చేశారని బీఆర్ఎస్ ను ఇంటికి పంపితే గద్దెనెక్కిన కాంగ్రెస్ కూడా గత ప్రభుత్వ ధోరణినే అవలంభిస్తోందన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు బీజేపీ త్వరలో సరైన సమాధానం చెప్పబోతుందని పేర్కొన్నారు. ఇక ఈ నెల 29లోపు బీజేపీ బూత్ కమిటీలు, మండల కమిటీల ఏర్పాటు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు జిల్లా కార్యదర్శి కాదూరి అచ్చయ్య, సీనియర్ నాయకుడు దాసరి మల్లేశం, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పడాల శ్రీనివాస్, మండల అధ్యక్షురాలు గుంటుపల్లి మహేశ్వరి సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు కర్రె ప్రవీణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మహేందర్, స్టేట్ కౌన్సిల్ మెంబర్ రచ్చ శ్రీనివాస్, జిల్లా కౌన్సిల్ మెంబర్ చంద్రమౌళి, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు నరేష్, మండల మాజీ అధ్యక్షులు సత్యం, ఆనంద్ గౌడ్ తదితరులు ఉన్నారు.

## యాదగిరిగుట్ట ఈవోగా వెంకట్రావు నియామకం



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదాద్రి భువనగిరి జిల్లా పరిధిలో గల ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ యాదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఈఓగా ఐఏఎస్ అధికారి ఎస్. వెంకట్రావు ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఆయన ఉమ్మడి జిల్లాలో నల్గొండ జాయింట్ కలెక్టర్ గా, సూర్యాపేట జిల్లా కలెక్టర్ గా విధులు నిర్వహించారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఏర్పడిన తర్వాత డిఆర్డిఏ పీడిగా కూడా ఆయన పనిచేశారు. జిల్లాపై కూడా ఆయనకు పూర్తిస్థాయిలో పట్టు ఉన్నది. ఆయన అనేక గ్రామాల్లో పర్యటించి అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రారంభించిన నేపథ్యం కూడా ఉన్నది.

## గుట్ట ఆలయ ఈవోగా తన మార్క్ చూపెట్టిన భాస్కర్ రావు



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: 2024 మార్చి 16న రెవెన్యూ డిపార్ట్‌మెంట్ నుండి డిప్యుటేషన్ పై వచ్చి యాదగిరిగుట్ట ఆలయ ఈవోగా బాధ్యతలు చేపట్టిన స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ భాస్కర్ రావు.. 13 నెలల పాటు తమ మార్క్ అడ్మినిస్ట్రేషన్ తో ఆలయంలో నెలకొన్న అనేక సమస్యలను ఓ కొలిక్కి తెచ్చారు. భక్తులకు సేద తీరడానికి నీడ కూడా లేని సమయంలో ఈవోగా ఛార్జ్ తీసుకున్న భాస్కర్ రావు.. జర్మన్ హ్యాంగర్ షెడ్లు ఏర్పాటు చేసి భక్తులకు నీడ కల్పించారు. కొండపైన విష్ణుపుష్కరిణి, అఖండ దీపం, కొబ్బరికాయలు కొట్టే సదుపాయాలను కల్పించి భక్తులు మొక్కులు చెల్లించుకోవడానికి వెసులుబాటు కల్పించారు. ముఖ్యంగా ఇష్టానుసారంగా వ్యవహరించే ఆలయ ఉద్యోగులను ఏకతాటిపైకి తెచ్చి అడ్మినిస్ట్రేషన్ ను సెట్ చేశారు. అవినీతికి పాల్పడిన అధికారులను సస్పెండ్ చేశారు. ఆలయంలో అడుగడుగునా పేరుకుపోయిన అవినీతిని కూకటివేళ్లతో తొలగించారు. ఇక ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన చేపట్టిన స్వామివారి దివ్యవిమాన గోపురానికి స్వర్ణతాపడం పనులను అన్నీ తానై దగ్గరుండి కంప్లీట్ చేశారు. అనంతరం ఐదు రోజుల పాటు మహాకుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవాలు చేపట్టి స్వర్ణవిమాన గోపురం ఆవిష్కరణను నభూతో నభవిష్యతి అన్న రీతిలో నిర్వహించి ప్రభుత్వ మన్ననలు పొందారు. అలాగే భక్తుల సౌకర్యార్థం కొండ చుట్టూ గిరిప్రదక్షిణ మార్గం, యాదరుషి ఆలయం, అడుగడుగునా మంచినీటి సదుపాయం కల్పించారు. అదేవిధంగా ప్రభుత్వంతో కొట్లాడి యాదగిరిగుట్టకు వేదపాఠశాలను మంజూరు చేపించడమే కాకుండా నిధులు సైతం విడుదల చేపించారు. దీనికోసం టెంపుల్ సిటీలో వైటీడీఏ పరిధిలో ఉన్న 15 ఎకరాల ల్యాండ్ ను ఆలయానికి బదిలీ చేపించారు. త్వరలో వేదపాఠశాల పనులు ప్రారంభం కానున్నాయి. ఆలయ ఈవోగా 13 నెలల స్వల్ప వ్యవధిలోనే మేజర్ గా ఉన్న సమస్యలన్నింటినీ కొలిక్కి తెచ్చి భక్తులు, ఆలయ ఉద్యోగుల నుండే కాకుండా ప్రభుత్వ, ప్రతిపక్షాల పార్టీల నాయకుల ప్రశంసలు సైతం అందుకున్నారు. 2024 మార్చి 16న ఈవోగా బాధ్యతలు చేపట్టిన భాస్కర్ రావు.. 13 నెలల 12 రోజుల పాటు విధులు నిర్వర్తించారు. సోమవారం ఆయన విధుల నుంచి రిలీవ్ కానుండగా.. ఈవోగా ఐఏఎస్ అధికారి వెంకటరావు బాధ్యతలు స్వీకరించనున్నారు.

# ఈపీడీసీ జాతీయ ఉపాధ్యక్షురాలిగా వి. శ్రీదేవి రాజేశ్వరి నియామకం

హైదరాబాద్, 27 ఏప్రిల్,(రోమింగ్ న్యూస్): కాకినాడ పట్టణానికి చెందిన ప్రముఖ సేవా సంస్థ "శ్రీ చారిటబుల్ ట్రస్ట్" అధ్యక్షురాలు వి. శ్రీదేవి రాజేశ్వరి ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ డెవలప్మెంట్ కౌన్సిల్ (ఈపీడీసీ) జాతీయ ఉపాధ్యక్షురాలిగా నియమితులయ్యారు. ఈ మేరకు ఈపీడీసీ వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్సీహెచ్ రంగయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

శ్రీమతి రాజేశ్వరి గత కొన్నేళ్లుగా శ్రీ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా విద్య, వైద్యం, మహిళా సాధికారత వంటి అనేక సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా, పర్యావరణ పరిరక్షణ పట్ల ఆమెకు ప్రత్యేకమైన శ్రద్ధ, ఆసక్తి ఉన్నాయి. ఈ అంశాలను పరిగణలోకి తీసుకున్న ఈపీడీసీ ఆంధ్రప్రదేశ్ కన్వీనర్ గిద్దా శ్రీనివాస నాయుడు ఆమె పేరును జాతీయ ఉపాధ్యక్ష పదవికి సిఫారసు చేశారు. ఈ సందర్భంగా ఎస్సీహెచ్ రంగయ్య మాట్లాడుతూ...శ్రీదేవి రాజేశ్వరి నిస్వార్థ సేవా దృక్పథం, పర్యావరణ పరిరక్షణ పట్ల ఆమెకున్న నిబద్ధత సంస్థకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని ఆశాభావం వ్యక్తం





చేశారు. రానున్న రెండేళ్ల పాటు ఆమె ఈ కీలక బాధ్యతల్లో కొనసాగుతారని తెలిపారు. కాగా తన నియామకం పట్ల శ్రీదేవి రాజేశ్వరి కృతజ్ఞతలు తెలియ చేశారు. ఈపీడీసీ జాతీయ ఉపాధ్యక్షురాలిగా తనకు అప్పగించిన బాధ్యతలను శక్తివంచన లేకుండా నిర్వహిస్తానని ఆమె పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ, అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. తన నియామకానికి సహకరించిన ఈపీడీసీ వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్సీహెచ్ రంగయ్య, ఏపీ కన్వీనర్ గిద్దా శ్రీనివాస నాయుడు మరియు ఇతర సభ్యులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
28 ఏప్రిల్
2025





# మనసంతా విషాన్ని నింపుకొన్న కేసీఆర్..

**తెలంగాణ ఇచ్చినందుకు కాంగ్రెస్ విలనా**

**సోనియాకు సాష్టాంగ నమస్కారం మరిచారా?**

**కాంట్రాక్టర్లకు బకాయిలు, సర్పంచ్‌లకు బాకీలు కేసీఆర్ హయాంలో పెట్టినవే..**

**మేం ఇబ్బంది పెట్టాలనుకుంటే సభ జరిగేదేనా?: మంత్రి పొంగులేటి**

**నియంతలా కేసీఆర్ మాటలు: సీతక్క**

**సోనియాగాంధీ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేయాలి: పొన్నం**

**కేసీఆర్‌లో ఇంకా గర్వం పోలేదు: జూపల్లి**



**హైదరాబాద్, ఏప్రిల్ 27 :** మనసంతా విషాన్ని నింపుకొన్న కేసీఆర్.. కాంగ్రెస్ పార్టీని విలన్‌గా చూపించే ప్రయత్నం చేశారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మండిపడ్డారు. హైదరాబాద్‌తో కూడిన తెలంగాణ రాష్ట్రం ఇచ్చినందుకు కాంగ్రెస్ పార్టీని విలన్‌గా చూపిస్తున్నారా? అని నిలదీశారు. తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన సోనియా గాంధీకి కేసీఆర్ సాష్టాంగ నమస్కారం చేసిన సంగతి మరిచిపోయారా? అని ప్రశ్నించారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో రాష్ట్ర ఖజానాను కొల్లగొట్టి, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం పథకాలు ఇవ్వట్లేదంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అన్ని అంశాలపై అసెంబ్లీలో చర్చకు సిద్ధమా? అని కేసీఆర్‌కు సవాల్ విసిరారు. ఆదివారం సీఎం రేవంత్ నివాసం వద్ద మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, సీతక్కలతో కలిసి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మీడియాతో మాట్లాడారు. ఇచ్చిన హామీ మేరకు దళితుడిని సీఎం చేయలేకపోయిన కేసీఆర్.. ఇప్పుడు కనీసం ప్రతిపక్ష నేత హోదా అయినా దళితుడికి ఇచ్చి ఉండవచ్చు కదా అని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ హయాంలోనే కాంట్రాక్టర్లు, సర్పంచ్‌లకు ప్రభుత్వ బకాయిలు పేరుకుపోయాయని చెప్పారు.

80 వేల పుస్తకాలు చదివిన కేసీఆర్.. ఆ జ్ఞానాన్ని అసెంబ్లీలో ప్రదర్శిస్తారనుకున్నామని, కానీ రాలేదని ఎద్దేవా చేశారు. "బీఆర్‌ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని కేసీఆర్ కలలు కంటున్నారు. కేసీఆర్ హయాంలో కాంగ్రెస్ పార్టీ సభలకు రాకుండా ఆటోడ్రైవర్లను, ప్రైవేటు టాక్సీ డ్రైవర్లను ఇబ్బంది పెట్టారు. ఆర్టీసీ బస్సులు అద్దెకు తీసుకోనివ్వకుండా చేశారు. మేమూ అలా ఇబ్బంది పెట్టాలనుకుంటే కేసీఆర్ సభ జరిగి ఉండేదే కాదు.." అని పొంగులేటి స్పష్టం చేశారు. ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడి, ట్యాపింగ్ చేసిన వారిని విదేశాల్లో ఉంచి డ్రామాలాడుతున్న కేసీఆర్‌కు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే నైతికత లేదని విమర్శించారు. ఔటర్ రింగ్ రోడ్డును దగ్గరి వాళ్లకు లీజుకు ఇచ్చుకున్నదెవరని.. మద్యం దుకాణాల టెండర్లను ముందే ఎందుకు పిలిచారని ప్రశ్నించారు. ఒక నియంత తన అధికారాన్ని కోల్పోయిన తర్వాత మాట్లాడినట్టుగా కేసీఆర్ ప్రసంగం ఉందని మంత్రి సీతక్క విమర్శించారు. వారి కుటుంబంలో చీలికలు పెరుగుతున్నాయన్న బాధ కేసీఆర్‌లో కనిపించిందని పేర్కొన్నారు. కేసీఆర్ బిడ్డ కవిత ఖరీదైన కార్లలో తిరగొచ్చుగానీ.. పేద మహిళలు ఆర్టీసీ బస్సుల్లో తిరగొద్దా? అని నిలదీశారు. అసెంబ్లీ సమావేశాలను సొల్లు కబుర్లంటూ అవమానించిన కేసీఆర్‌కు.. మళ్లీ అసెంబ్లీకి వచ్చే అర్హత ఉందా? అని నిలదీశారు. మరి ఆయన కొడుకు, అల్లుడిని అసెంబ్లీకి ఎందుకు పంపుతున్నారని ప్రశ్నించారు.

**ఆ మాటలు ఉపసంహరించుకోవాలి: పొన్నం**

తెలంగాణ పాలిట విలన్ కాంగ్రెస్ పార్టీ అన్న కేసీఆర్ మాటలను ఉపసంహరించుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. సోనియాగాంధీ తప్ప తెలంగాణ రాష్ట్రాన్ని ఎవరూ ఇవ్వలేరన్న సంగతి కేసీఆర్‌కు తెలుసని చెప్పారు. సోమవారం అన్ని జిల్లా కేంద్రాల్లో సోనియా గాంధీ చిత్రపటాలకు పాలతో అభిషేకం చేయాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. కేసీఆర్ సభకు జనం రాకుంటే.. ఆ నెపం పోలీసులు, ప్రభుత్వంపైకి నెట్టడం ఏమిటని నిలదీశారు. జనం రాకపోవడం వల్లే.. కేసీఆర్ అరగంట సేపు వేదికపైకి రాలేదన్నారు.

**కేసీఆర్ ఇంట్లో వేల కోట్లు: జూపల్లి**

కేసీఆర్ హయాంలో జరిగిన రుణమాఫీ వడ్డీలకే సరిపోలేదని మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. అక్షయపాత్ర లాంటి ఔటర్ రింగ్ రోడ్డును కేసీఆర్ అమ్ముకున్నారని ఆరోపించారు. అధికారం పోయినా కేసీఆర్‌లో గర్వం పోలేదని విమర్శించారు. కేసీఆర్ నిజాయతీపరుడైతే ఆయన పార్టీకి రూ. 1,500 కోట్ల ఫండ్ ఎక్కడి నుంచి వచ్చిందో చెప్పాలన్నారు. కేసీఆర్ హయాంలో పనిచేసిన ఇంజనీర్ దగ్గరే రూ.వంద కోట్లపైగా ఆస్తులు దొరికాయని.. కేసీఆర్ ఇల్లును సోదా చేస్తే రూ. వేల కోట్లు దొరుకుతాయని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ సభలో కేసీఆర్ ప్రసంగంలో స్వయం డబ్బా, పరనింద తప్ప ఏమీ లేదని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ ఒక ప్రకటనలో విమర్శించారు. కేసీఆర్ రెచ్చగొడితే రెచ్చిపోడానికి తెలంగాణ ప్రజలు సిద్ధంగా లేరని పేర్కొన్నారు. కేసీఆర్‌కు సీఎం పదవే కాంగ్రెస్ పెట్టిన భిక్ష అని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# బినామీల గుట్టు విప్పని హరిరామ్!

**ఆస్తుల లెక్క రూ.200 కోట్ల పైమాటే..**

**కాళేశ్వరం ఈఎన్‌సీకి 14 రోజుల రిమాండ్**

**చంచల్‌గూడ జైలుకు తరలింపు**

**హైదరాబాద్, ఏప్రిల్ 27 :** ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్టయిన కాళేశ్వరం ఈఎన్‌సీ భూక్యా హరిరామ్ కూడబెట్టిన ఆస్తుల విలువ రూ.200 కోట్ల పైమాటేనని ఏసీబీ వర్గాలు చెబుతున్నాయి. అయితే, తన బినామీల గుట్టును హరిరామ్ బయటపెట్టలేదని సమాచారం. దీంతో ఆయన్ను కస్టడీలోకి తీసుకుని విచారణ చేపట్టాలని ఏసీబీ భావిస్తోంది. హరిరామ్‌ను శనివారం అదుపులోకి తీసుకున్న అధికారులు ఆదివారం తెల్లవారుజామున 3గంటలకు న్యాయమూర్తి ఇంట్లో హాజరు పరిచారు. న్యాయమూర్తి 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించగా హరిరామ్‌ను చంచల్‌గూడ జైలుకు తరలించారు.

**వేలకోట్ల పనుల్లో భాగస్వామి**

కాళేశ్వరం ప్రాజెక్టు సహా నీటిపారుదల శాఖలోని పలు ముఖ్యమైన ప్రాజెక్టుల్లో హరిరామ్ కీలకపాత్ర పోషించారు. హరిరామ్ చేతుల మీదుగా వేలకోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టుల పనులు జరిగాయి. ఈ క్రమంలోనే హరిరామ్ భారీగా అక్రమఆస్తులు కూడబెట్టినట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. బహిరంగ మార్కెట్‌లో రూ.200 కోట్లకు పైగా విలువ ఉండే ఆస్తులను ఇప్పటిదాకా గుర్తించామని అధికారులు అంతర్గత సంభాషణల్లో పేర్కొంటున్నారు. కేసీఆర్ వ్యవసాయ క్షేత్రం ఉన్న మర్కూక్ మండలంలో హరిరామ్ 28 ఎకరాల వ్యవసాయ భూమిని కొనుగోలు చేశారు. హైదరాబాద్‌లోని షేక్‌పేట్, కొండాపూర్‌లో హరిరామ్‌కు రెండు విల్లాలుండగా వాటి విలువ రూ.10 కోట్లకు పైనే ఉంటుందని సమాచారం. ఇక, హైదరాబాద్‌లోని శ్రీనగర్‌కాలనీ, మాదాపూర్, నార్సింగ్ ప్రాంతాల్లో ఆయనకు ఉన్న ఫ్లాట్ల విలువ రూ.10 కోట్లకు పైనే ఉంటుందని అంచనా. ఏపీ రాజధాని అమరావతిలో హరిరామ్‌కు ఉన్న వాణిజ్య స్థలం విలువ రూ.20 కోట్లు ఉండవచ్చునని చెబుతున్నారు. ఇవే కాక, పటాన్‌చెరు లాంటి కీలక ప్రాంతంలో 20 గుంటల స్థలం, శ్రీనగర్ కాలనీలో రెండు ఇండిపెండెంట్ ఇళ్లు, బొమ్మలరామారంలో ఆరు ఎకరాల మామిడితోటలో ఖరీదైన ఫామ్‌హౌస్, కొత్తగూడెంలో ఓ వాణిజ్య సముదాయం, కుత్బుల్లాపూర్, మిర్యాలగూడలో ఇళ్ల స్థలాలు గుర్తించారు. హరిరామ్‌కు చెందిన కొన్ని బ్యాంకు లాకర్లు ఇంకా తెరవాల్సి ఉంది. కాగా, హరిరామ్‌ను విచారించే విషయంలో వారం రోజులు కస్టడీ కోరుతూ ఏసీబీ సోమవారం న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేసే అవకాశం ఉంది.

# కర్రెగుట్టల్లో భారీ గుహ


**సేఫ్‌జోన్‌గా వినియోగించిన నక్సల్స్**

**అర కి.మీ పొడవు.. సహజ నీటివనరులు**

**వెయ్యి మంది ఉండేందుకు అనుకూలం**

**బియ్యం, నిత్యావసర వస్తువుల గుర్తింపు**

**కర్రెగుట్టల్లో వందల గుహలు: ఆదివాసీలు**



**చర్ల, ఏప్రిల్ 27 :** దుర్భేద్యమైన కర్రెగుట్టలను సేఫ్‌జోన్‌గా మలచుకున్న మావోయిస్టులు.. గుట్టల్లో ఉండే గుహలను ఆవాసాలుగా మలచుకున్నట్లు భద్రత బలగాలు గుర్తించాయి. శనివారం రాత్రి ఈ తరహాలో ఓ భారీ గుహను బలగాలు వెలుగులోకి తీసుకువచ్చాయి. ఛత్తీస్‌గఢ్ వైపు.. పూజారీ కాంకేర్ నుంచి పలు అంచెలుగా కర్రె గుట్టలు దాటాక.. ఈ గుహ బయటపడ్డట్లు జవాన్లు తెలిపారు. ఓ గుట్ట అంచులో.. సుమారు అర కిలోమీటర్ మేర ఉన్న ఈ గుహ సుమారు వెయ్యి మంది తలదాచుకునేందుకు అనుకూలంగా ఉంటుందని వెల్లడించారు. "గుహలో వెలుతురు అస్సలు ఉండదు. కటిక చీకటి. పక్కనున్న మనిషిని కూడా పోల్చుకోలేని పరిస్థితి ఉంటుంది. చెలమలతో సహజ నీటి నిల్వలు అక్కడక్కడా కనిపించాయి. 30–50 మీటర్ల ఎత్తుండే గుట్టలు చుట్టూ ఉంటాయి. దీని వల్ల వడగాల్పులు, భారీ వర్షాలు, చలిగాలుల ప్రభావం ఈ గుహపై పెద్దగా కనిపించదు. ఎండాకాలం కూడా గుహలో చల్లదనం ఉండడాన్ని గమనించాం" అని ఓ జవాను 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. జవాన్లు గుహలోకి ప్రవేశించాక.. అక్కడ బియ్యం, ఇతర నిత్యావసరాలు ఉండడాన్ని గమనించారు. కూంబింగ్ తమను సమీపిస్తుండడంతో మావోయిస్టులు ఈ గుహను వదిలి పారిపోయి ఉంటారని అనుమానిస్తున్నారు.

**వందలకొద్దీ గుహలు.. గుర్తించడం కష్టం!**

సుమారు 288 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించిన కర్రెగుట్టల్లో వందల సంఖ్యలో గుహలు ఉన్నట్లు పూజారీ కాంకేర్ పరిసరాల్లోని ఆదివాసీలు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. కొన్ని గుహలు గుట్ట మొదట్లోనే ఉంటాయని, మరికొన్ని అంచుల్లో ఉంటాయని వివరించారు. ప్రస్తుతానికి జవాన్లు గుర్తించిన గుహ ఒక్కటే అయినా.. అలాంటివి వందల్లో ఉంటాయంటున్నారు. "గుహ అనగానే.. గుట్ట మధ్యలో చూడగానే కనిపించేట్లు ఉండదు. అతి సమీపానికి వెళ్లినా.. అక్కడ గుహ ఉన్నట్లు తెలియదు. గుట్టల పైనుంచి కిందకు వాలే తీగ మొక్కలు గుహను మూసివేస్తాయి. లోపల సూర్యరశ్మి కూడా సోకదు. కొన్ని గుహలు కిలోమీటరు పొడవు ఉంటాయి. వన్యప్రాణులు ఎక్కువగా ఇలాంటి గుహల్లో నివసిస్తాయి" అని స్థానికులు తెలిపారు. శనివారం రాత్రి జవాన్లు గుర్తించిన గుహ కూడా ఇదే తరహాలో ఉండడం గమనార్హం..! కేంద్ర ప్రభుత్వం ఛత్తీస్‌గఢ్‌లో 'ఆపరేషన్ కగార్' ప్రారంభించాక.. మావోయిస్టులు కర్రెగుట్టలను సేఫ్‌జోన్‌గా మలచుకున్నట్లు.. సెంట్రల్ కమిటీ నేతలు కూడా ఇక్కడ సమావేశమైనట్లు ప్రచారం జరుగుతోంది.

**అందాలే కాదు.. అడుగడుగునా అపాయం!**

కర్రెగుట్టలో మనుగడ సాగించడం అంత సులభం కాదని స్థానికులు చెబుతున్నారు. "గుట్టల మధ్యలో చిత్తడి నేలలుంటాయి. పొడి నేలల మీదుగా వెళ్తున్నా.. అక్కడక్కడా మృత్యు కుహరాల్లా ఊబిలు ఉంటాయి. తాచుపాములు, ఇతర విషకీటకాలుంటాయి. అడవి కందిరీగలు కుడితే.. అవి కుట్టిన చోట మంటతోపాటు.. వాపు ఉంటుంది" అని స్థానిక ఆదివాసీలు వివరించారు. గత ఏడాది తెలంగాణ గ్రేహౌండ్స్ బలగాలు ఇక్కడ వారం రోజులు కూంబింగ్ నిర్వహించి, చతికిలపడిపోయినట్లు పోలీసులు గుర్తుచేస్తున్నారు. కాళ్లు వాచిపోయి, నడవలేని స్థితికి చేరుకున్నట్లు చెబుతున్నారు. "కర్రెగుట్టల్లో వాతావరణం ఉన్నపళంగా మారిపోతోంది. మండుటెండ, ఉక్కబోత ఉంటుంది. కాసేపటికే అకస్మాత్తుగా వర్షాలు కురుస్తాయి. గురువారం 15మంది జవాన్లు వడదెబ్బకు గురవ్వగా.. శని, ఆదివారాల్లో పలువురు జవాన్లు డీ–హైడ్రేషన్‌కు గురయ్యారు. అయితే.. సాయంత్రం వేళల్లో భారీ వర్షాలు కురిశాయి" అని వెల్లడించారు.



# ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా రామకృష్ణారావు..

**స్మితా సభర్వాల్‌పై వేటు..అప్రాధాన్య పోస్టుకు బదిలీ..**

**భారీగా ఐఏఎస్‌ల బదిలీలు**

**ఈ ఏడాది ఆగస్టు వరకు పదవీ కాలం**

**జయేశ్‌రంజన్‌కు కీలక బాధ్యతలు..**

**పరిశ్రమల పెట్టుబడుల సెల్‌కు సీఈవో**

**మిస్ వరల్డ్ పోటీల బాధ్యత కూడా..**

**జీహెచ్‌ఎంసీ కమిషనర్‌గా ఆర్వీ కర్ణన్**

**హెచ్‌ఎండీఏ కమిషనర్‌గా ఇలంబర్తి..**

**కుటుంబ సంక్షేమ కమిషనర్‌గా సంగీత సత్యనారాయణ**

**హైదరాబాద్, ఏప్రిల్ 27 :** సీనియర్ ఐఏఎస్ అధికారిణి స్మితాసభర్వాల్‌పై వేటు పడింది. పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శిగా.. మిస్ వరల్డ్ పోటీలకు సన్నాహాలు చేస్తున్న ఆమెను ప్రభుత్వం పాత స్థానానికి బదిలీ చేసింది. ఆర్థిక సంఘం(ఫైనాన్స్ కమిషన్) సభ్య కార్యదర్శిగా నియమించింది. ఆదివారం ప్రభుత్వం భారీగా ఐఏఎస్ అధికారులను బదిలీ చేసింది. కంచ గచ్చిబౌలి భూముల వివాదంపై ఆమె సర్కారుకు వ్యతిరేకంగా పోస్టు చేయడం ఇటీవల చర్చనీయాంశమైన విషయం తెలిసిందే..! దీనిపై వివరణ ఇవ్వాలంటూ గచ్చిబౌలి పోలీసులు ఆమెకు నోటీసులు జారీ చేశారు. అప్పటి నుంచే స్మిత బదిలీ తప్పనిసరి అనే ప్రచారం జరిగింది. తాజా నిర్ణయంతో సర్కారు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న ప్రపంచ సుందరి పోటీల బాధ్యత నుంచి ఆమెను తప్పించినట్లయింది. కాగా.. సీనియర్ ఐఏఎస్ అధికారి జయేశ్‌రంజన్‌కు తాజా బదిలీల్లో పరిశ్రమల శాఖలో మరింత కీలకమైన బాధ్యతలను అప్పగించారు.

ముఖ్యమంత్రి కార్యాలయంలో ప్రత్యేకంగా 'పరిశ్రమల పెట్టుబడుల సెల్'ను ఏర్పాటు చేసి, జయేశ్ రంజన్‌ను సీఈవోగా నియమించారు. దీంతోపాటు.. స్మిత సభర్వాల్ ఇప్పటి వరకు పర్యవేక్షించిన పర్యాటక శాఖ అదనపు బాధ్యతలను కూడా జయేశ్‌రంజన్‌కు అప్పగించారు. అంటే.. ప్రపంచ సుందరి పోటీలను ఆయనే పర్యవేక్షిస్తారు. పురపాలక పాలన, పట్టణాభివృద్ధి ముఖ్యకార్యదర్శిగా ఉన్న దానకిశోర్ కార్మికశాఖకు బదిలీ అవ్వగా.. ఆ స్థానంలో ఉన్న సంజయ్‌కుమార్‌ను పరిశ్రమలు, వాణిజ్యశాఖ ముఖ్యకార్యదర్శిగా నియమించారు. గవర్నర్ కార్యాలయ ముఖ్యకార్యదర్శిగా కూడా దానకిశోర్‌కు అదనపు బాధ్యతలను అప్పగించారు. పాఠశాల విద్య సంచాలకుడిగా ఈవీ నర్సింహారెడ్డిని పరిశ్రమల పెట్టుబడుల సెల్‌కు అదనపు సీఈవోగా బదిలీ చేశారు.

**అధికారి పేరు బదిలీ అయిన స్థానం**

ఆర్వీ కర్ణన్ జీహెచ్‌ఎంసీ కమిషనర్
సంగీత సత్యనారాయణ వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్
ఇలంబర్తి పట్టణాభివృద్ధి కార్యదర్శి(హెచ్‌ఎండీఏ పరిధి)
టీకే శ్రీదేవి పట్టణాభివృద్ధి కార్యదర్శి(హెచ్‌ఎండీఏ వెలుపల)
శశాంక్ గోయల్ గుడ్ గవర్నెన్స్ వైస్ చైర్మన్
కే.శశాంక ఫ్యూచర్ సిటీ డెవలెపమెంట్ అథారిటీ కమిషనర్
ఎస్.హరీశ్ జెన్‌కో సీఎండీ
నిఖిల మానవహక్కుల కమిషన్ సెక్రటరీ, సీఈవో
ఎస్. వెంకటరావు దేవాదాయశాఖ డైరెక్టర్, యాదగిరిగుట్ట ఈవో
పి.కాత్యాయనీ దేవి సెర్ప్ అదనపు సీఈవో
హేమంత్ సహదేవ్‌రావు జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్
ఫణీంద్రారెడ్డి టీజీఎంఎసఐడీసీ ఎండీ
కథిరవన్ పంచాయతీ రాజ్ జాయింట్ కమిషనర్
విద్యా సాగర్(నాన్ క్యాడర్) హైదరాబాద్ అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు)
ఉపేందర్ రెడ్డి (నాన్ క్యాడర్) హెచ్‌ఎండీఏ కార్యదర్శి

# దక్షిణంలోనూ అధికారంలోకి వస్తాం

మొదటి పేజీ తరువాయి

జి.కిషన్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకల సందర్భంగా ఆదివారం విజయవాడలోని ఎస్–కన్వెన్షన్ హాల్లో నిర్వహించిన మేధావుల సదస్సులో ఆయన మాట్లాడారు. అంబేడ్కర్ జయంతిని ఏప్రిల్ 14నే కాకుండా పదిరోజుల పాటు దేశవ్యాప్తంగా నిర్వహించాలని బీజేపీ నిర్ణయించిందన్నారు. దేశభక్తి కలిగిన వ్యక్తి అంబేడ్కర్ అని, కమ్యూనిస్టు సిద్ధాంతాలను కాదన్నందుకు ఆయనను ఓడించాలని, అవమానపరచాలని అనేక విధాలుగా ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. అంబేడ్కర్ ఎంపీగా పోటీచేస్తే ఓడించాలని నెహ్రూ విస్తృతంగా ప్రచారం చేశారన్నారు. రాజ్యాంగాన్ని అవమానపరిచేలా కాంగ్రెస్ వ్యవహరించిందని, అధికారాన్ని నిలుపుకోవటం కోసం రాజ్యాంగాన్ని తనకు అనుకూలంగా మార్చుకుందని విమర్శించారు. అంబేడ్కర్ ఆశయాల స్ఫూర్తితోనే బీజేపీ ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. అంబేడ్కర్ అంతిమ సంస్కారం జరిగిన పంచతీర్థ స్థలాన్ని అద్భుతంగా తీర్చిదిద్దామని, పార్లమెంటులో అంబేడ్కర్ చిత్రపటాన్ని పెట్టి గౌరవించిన ఘనత మోదీకే దక్కుతుందని చెప్పారు. బీజేపీ అధికారంలోకి వచ్చాకే అంబేడ్కర్‌కు భారతరత్న ఇచ్చిందన్నారు. ఆయుష్మాన్ భారత్ పేరుతో మోదీ పేద ప్రజలకు రక్షణ కల్పించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.దయాకర్‌రెడ్డి, అధికార ప్రతినిధి ఆర్‌డీ విల్సన్, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గుడిసే దేవానంద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
28 ఏప్రిల్
2025





## ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమానికి కృషి

### దశలవారీగా పెండింగ్ సమస్యల పరిష్కారం: పొన్నం

**హైదరాబాద్, ఏప్రిల్ 27 :** రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని అందుకు రాష్ట్ర ప్రభుత్వం యాజమాన్యానికి సహకారం అందిస్తుందని రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల పెండింగ్ సమస్యలను దశలవారీగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. లక్డీకపూల్‌లోని ఓ హోటల్‌లో ఆదివారం టీజీఎస్ ఆర్టీసీ రిటైర్డ్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఐదో వార్షిక సమావేశానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

90 ఏళ్లు నిండిన ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులను సంస్థ ఎండీ వీసీ సజ్జనర్‌తో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ.. ప్రజా రవాణా వ్యవస్థ మేలు కోసం రిటైర్డ్ అధికారులు, ఉద్యోగులు చేసిన సేవలు గొప్పవని కొనియాడారు. ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమం, ప్రజలకు సౌకర్యవంతమైన రవాణా సౌకర్యం, సంస్థ పరిరక్షణ, ఈ మూడు అంశాలే ప్రాధాన్యాలుగా సంస్థ ముందుకు పోతోందని చెప్పారు. ఏడాది కాలంలో ఉద్యోగులు సంక్షేమానికి పెద్దపీట వేస్తూనే కొత్త బస్సుల కొనుగోలు చేపట్టినట్లు వివరించారు. కొత్త బస్సులకు అనుగుణంగా ఉద్యోగ నియామకాలను చేపడుతున్నామని ఆయన తెలిపారు. ఆర్టీసీ ఎండీ సజ్జనర్ మాట్లాడుతూ.. ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సలహాలు, సూచనలతో సంస్థలో ఎన్నో వినూత్న కార్యక్రమాలను ప్రవేశపెట్టామని తెలిపారు.

## బీఆర్ఎస్ సభ నుంచి వస్తున్న వాహనం ఢీకొని ఇద్దరి మృతి

### సిద్దిపేట జిల్లా రాంపూర్ క్రాసింగ్ వద్ద రోడ్డు ప్రమాదం



**నంగునూరు, ఏప్రిల్ 27 :** సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం రాంపూర్ క్రాసింగ్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఎల్కతుర్తిలో జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ సభ నుంచి వస్తున్న ఓ జీపు(తుఫాన్) ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. పోలీసుల కథనం ప్రకారం.. సిద్దిపేట జిల్లా కోహెడ మండలం బస్వాపూర్‌కు చెందిన తాడం సారయ్య(36), బండోజు గణేష్ (32)వడ్రంగి పని చేస్తుంటారు. సిద్దిపేటలో పని ముగించుకుని ఆదివారం రాత్రి ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి తిరుగుప్రయాణమయ్యారు. అయితే, బీఆర్ఎస్ రజతోత్సవ సభ నుంచి వస్తున్న నిర్మల్ జిల్లా బైంసాకు చెందిన తుఫాన్ వాహనం.. రాంపూర్ క్రాసింగ్ వద్ద వీరి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో సారయ్య అక్కడికక్కడే మరణించగా, గాయపడిన గణేష్ ఆస్పత్రికి తరలిస్తుండగా ప్రాణాలు కోల్పోయాడు. ప్రమాదానికి కారణమైన వాహన డ్రైవర్ పరారీలో ఉన్నాడు. ఇక, ఈ రోడ్డు ప్రమాదం వల్ల రహదారిలో చాలాసేపు ట్రాఫిక్ స్తంభించింది. మృతుల కుటుంబాలకు రూ.2లక్షల చొప్పున ఆర్థికసాయం అందిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. బీఆర్ఎస్ తరఫున రూ.50లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## విచారణకు రాలేను.. మరో తేదీ ఇవ్వండి

### *ఈడీకి సినీ హీరో మహేశ్ బాబు లేఖ*



**హైదరాబాద్, ఏప్రిల్ 27 :** షూటింగ్‌లో బిజీగా ఉన్నందున సోమవారం విచారణకు రాలేనని సినీ హీరో మహేశ్‌బాబు ఈడీ అధికారులకు లేఖ పంపారు. ముందే నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం తాను సినిమా షూటింగ్‌లో ఉన్నానని.. విచారణకు మరో తేదీ ఇవ్వాలని కోరారు. మనీ లాండరింగ్ ఆరోపణలు ఎదుర్కొంటున్న సురానా గ్రూపు, సాయి సూర్య డెవలపర్స్ సంస్థలకు సంబంధించిన ప్రకటనల్లో మహేశ్ నటించారు. సాయి సూర్య డెవలపర్స్ ప్రకటనల్లో నటించినందుకు మహేశ్ బాబుకు రూ.5.9 కోట్లు పారితోషికం చెల్లించారు. అందులో రూ.2.5 కోట్లు నగదు రూపంలో ఇచ్చారు. ఇటీవల జరిగిన ఈడీ సోదాల్లో ఈ విషయం వెల్లడికావడంతో మహేశ్‌బాబు 28న విచారణకు రావాలని ఈడీ నోటీసు జారీ చేసింది.

# అకాల వర్షం.. తడిసిన ధాన్యం..

**వివిధ జిల్లాల్లో వాన.. ఈదురుగాలుల బీభత్సం..**

**నారాయణపేటలో పిడుగుపాటుకు ఇద్దరి మృతి**

**ధాన్యం కాపాడుకునే ప్రయత్నంలో ఒకరు, పొలం పనుల్లో ఉండగా మరొకరు మృత్యువాత**

**పలుచోట్ల పిడుగులకు బలైన మూగజీవాలు**

**ఈదురుగాలులకు కూలిన చెట్లు, స్తంభాలు**



మండువేసవిలో అకాలవర్షం మరోసారి రైతులను నష్టాల పాల్జేసింది. శనివారం రాత్రి, ఆదివారం కురిసిన వర్షానికి పలుచోట్ల వరి నేలకొరిగింది. ఇంకొన్నిచోట్ల కల్లాల్లో ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. నారాయణపేట జిల్లాలో పిడుగుపాటుకు ఇద్దరు రైతులు ప్రాణాలు కోల్పోయారు. ఈ జిల్లాతో పాటు జోగులాంబ గద్వాల జిల్లాలో పిడుగులు పడి అనేక మూగజీవాలు మృత్యువాతపడ్డాయి. వివిధ జిల్లాల్లో ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. సోమవారం వరంగల్, మహబుబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో శనివారం రాత్రి, ఆదివారం అకాల వర్షం, పిడుగులు బెంబేలెత్తించాయి. నారాయణపేట జిల్లా మక్తల్ మండలంలో ఆదివారం మధ్యాహ్నం పిడుగులు పడి ఇద్దరు యువకులు మృతిచెందారు. ఉప్పర్‌పల్లికి చెందిన పట్నం ఆంజనేయులు (36) పొలంలోని కల్లంలో ఆరబెట్టిన ధాన్యంపై కవర్లు కప్పుతుండగా పిడుగు పడి మృతిచెందాడు.

దాదన్‌పల్లికి చెందిన యువకుడు కురుమూర్తి (17) పొలం పనుల్లో నిమగ్నమై ఉండగా పిడుగుపాటుకు ప్రాణాలు కోల్పోయాడు. నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో పలు గ్రామాల్లో పిడుగులు పడి 2 ఆవులు, 2 ఎద్దులు, 2 గేదెలు, కోడెదూడ, 15 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. మేకలసోంపల్లిలో ఓ ఇల్లు పిడుగు పడి పాక్షికంగా దెబ్బతిన్నది. ఇంట్లో వారు క్షేమంగా ఉన్నారు. గద్వాల, ధరూరు, కేటీదొడ్డి మండలాలతో పాటు వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం మూలమల్ల గ్రామంలోని కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయింది. కొనుగోళ్లను వేగవంతం చేయాలని రైతులు కోరారు. నారాయణపేట జిల్లా మాగనూరు సమీపంలో 167వ జాతీయ రహదారిపై 11 కేవీ, 33 కేవీ విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. తాళంకేరిలో ఇళ్ల మధ్య ఉన్న విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా దహెగాం, పెంచికలపేట, జగిత్యాల జిల్లా మెట్‌పల్లి, కోరుట్ల మండలాల్లో శనివారం రాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దహెగాం మండలం గిరివెల్లి, ఖర్జీ తదితర గ్రామాల్లో వరి నేలకొరిగింది. పలుచోట్ల కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. అయినం గ్రామంలో ఈదురుగాలులకు నాలుగు విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. కోరుట్ల మండలలో మామిడి నేలరాలడంతో రైతులకు నష్టం వాటిల్లింది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్, సంస్థాన్ నారాయణపురం, వలిగొండ, భువనగిరి మండలాల్లో ఆదివారం అకాల వర్షం కురిసింది. చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ యార్డులో ధాన్యం రాశులు తడిసిపోయాయి.



**ఎండ తీవ్రత పెరుగుతుంది!**

రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టి.. 37 నుంచి 40 డిగ్రీల్లోపే నమోదైనా.. సోమవారం నుంచి ఎండ తీవ్రత పెరుగుతుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, జగిత్యాల, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, మంచిర్యాల జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రత 43-45 డిగ్రీల మధ్య నమోదవుతుందని తెలిపింది. కాగా ఆదివారం హైదరాబాద్‌లో వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఉపశమనం పొందారు. నిన్నటి వరకు 41-42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవ్వగా.. ఆదివారం ఒకేసారి 4-5 డిగ్రీలు తగ్గింది. కాగా, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో వడదెబ్బ తగిలి చికిత్సపొందుతున్న ఇద్దరు ఆదివారం మృతిచెందారు.

## మరో 25 ఏళ్లు ప్రజాసేవలో బీఆర్ఎస్

### కొండాలక్ష్మణ్, జయశంకర్ మాకు స్ఫూర్తి: కేటీఆర్



**హైదరాబాద్ ఏప్రిల్ 27 :** ఉద్యమ పార్టీగా ఆవిర్భవించి.. ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించి, అధికారం చేపట్టాక.. తెలంగాణ ప్రగతికోసం నిరంతరం పాటుపడుతూ.. బీఆర్ఎస్ 25 ఏళ్లు తన ప్రస్థానం సాగించిందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. 25 ఏళ్లు పూర్తిచేసుకొని.. నిర్విరామంగా కృషి చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ... అమరులు, పెద్దలు, తెలంగాణ ప్రజల ఆశీర్వాదంతో మరో 25 ఏళ్లు తెలంగాణలో ప్రజాసేవలో కొనసాగే అవకాశం లభిస్తుందని ఆశిస్తున్నామన్నారు. బీఆర్ఎస్ రజతోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం తెలంగాణ భవన్‌లో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ గులాబీ జెండాను ఆవిష్కరించారు. ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి ఆయన నివాళులు అర్పించారు.

అనంతరం గన్‌పార్క్‌లోని తెలంగాణ అమరుల స్తూపం వద్దకు చేరుకొని నివాళులర్పించారు. ఆ తర్వాత ట్యాంక్‌బండ్ వద్ద కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహానికి కేటీఆర్ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొండాలక్ష్మణ్ బాపూజీ, ప్రొఫెసర్ జయశంకర్ స్ఫూర్తితోపాటు పార్టీ అధినేత కేసీఆర్ అందించిన నాయకత్వమే.. 25 ఏళ్ల బీఆర్ఎస్ ప్రస్థానానికి ప్రధానం కారణమన్నారు. గులాబీ జెండాకు ఏ గడపా దొరకని కాలంలో తన గడపను ఇచ్చి, కొండంత అండగా నిలిచిన కొండాలక్ష్మణ్ బాపూజీకి వినమ్రంగా నివాళి అర్పిస్తున్నానని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమానికి, బీఆర్ఎస్ ప్రస్థానానికి ఆ ఇద్దరు ప్రముఖులు మూలస్తంభాలని కొనియాడారు. ఆనాడు ఒకరితో ప్రారంభమైన పార్టీ.. లక్షల మందితో బలోపేతమై తెలంగాణను సాధించిందన్నారు.

## తమిళనాడులో ఇద్దరు మంత్రులు అవుట్

**సెంథిల్ బాలాజీ, పొన్ముడి రాజీనామా**

**సీఎం స్టాలిన్ సిఫారసుకు గవర్నర్ ఆమోదం**

**క్యాబినెట్‌లోకి తంగరాజ్.. నేడు ప్రమాణం**

**చెన్నై, ఏప్రిల్ 27 :** అవినీతి, అక్రమాలు, వివాదాస్పద వ్యాఖ్యలతో న్యాయస్థానాల మొట్టికాయలు తిన్న ఇద్దరు తమిళనాడు మంత్రులు తమ పదవులకు రాజీనామా చేశారు. రాష్ట్ర విద్యుత్, ఎక్సైజ్ శాఖల మంత్రి సెంథిల్ బాలాజీ, అటవీ మంత్రి కె.పొన్ముడి ఆదివారం తమ రాజీనామా లేఖలను సీఎం స్టాలిన్‌కు పంపించారు. వారి వ్యవహారం తన ప్రభుత్వానికి ఇబ్బందుల్లోకి నెట్టే సూచనలు కనిపిస్తుండడంతో పదవుల నుంచి తప్పుకోవాలని ముఖ్యమంత్రే వారిని ఆదేశించినట్లు సమాచారం. ఆయన సిఫారసుతో వారి రాజీనామాలను గవర్నర్ ఆర్ఎన్ రవి తక్షణమే ఆమోదించారు. డీఎంకే సీనియర్ నేత, పద్మనాభపురం ఎమ్మెల్యే మనో తంగరాజ్‌ను కొత్తగా మంత్రివర్గంలోకి తీసుకునేందుకు ఆయన అంగీకరించారు. సోమవారం సాయంత్రం 6 గంటలకు తంగరాజ్‌తో గవర్నర్ ప్రమాణం చేయించనున్నట్లు రాజ్‌భవన్ ప్రకటించింది. ఇంకోవైపు.. సెంథిల్ నిర్వహించిన విద్యుత్‌శాఖను రవాణా మంత్రి శివశంకర్‌కు.. ఎక్సైజ్‌శాఖను గృహనిర్మాణ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎస్.ముత్తుస్వామికి, పొన్ముడి అటవీశాఖను డెయిరీ శాఖ మంత్రి ఆర్ఎస్ రాజకన్నప్పన్‌కు అదనంగా అప్పగించారు.

## మంత్రి తుమ్మలతో జార్ఖండ్ మంత్రి శిల్పి నేహ భేటీ

**రెండు రాష్ట్రాల్లో వ్యవసాయ పథకాలపై చర్చ**

**హైదరాబాద్, ఏప్రిల్ 27 :** రైతుల కోసం తెలంగాణ ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను జార్ఖండ్ వ్యవసాయశాఖ మంత్రి శిల్పి నేహ తెలుసుకున్నారు. ఆదివారం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో ఆమె భేటీ అయ్యారు. ఇరువురు మంత్రులు పరస్పరం తమ రాష్ట్రాల్లో అమలు చేస్తున్న రైతు పథకాలపై చర్చించారు. రాష్ట్రంలో అమలవుతున్న రైతు సంక్షేమ పథకాలను శిల్పి నేహకు మంత్రి తుమ్మల తెలిపారు. ఆయిల్‌పామ్ సాగుకు ప్రోత్సాహంతోపాటు దాన్ని లాభదాయక పంటగా



తీర్చిదిద్దడానికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఇక వ్యవసాయ రంగంలో కృత్రిమ మేధస్సు వినియోగం, కొత్త పథకాలు, రైతులకు లాభదాయకం చేసే విధానాల అమలుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. రైతులకు ప్రయోజనం చేకూర్చేందుకు హార్టికల్చర్ రంగం అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు, ఆ రంగ ఉత్పత్తులకు మార్కెటింగ్ పరిష్కారాలను వెల్లడించారు. రాష్ట్ర బడ్జెట్‌లో సింహభాగం రైతులకు కేటాయించామని, దేశంలో ఎక్కడా లేని విధంగా ఏకకాలంలో రూ.2 లక్షల లోపు పంట రుణాలను మాఫీ పూర్తి చేశామని మంత్రి తుమ్మల చెప్పారు. రూ.20,616 కోట్లతో 25,35,964 మంది రైతులను రుణ విముక్తులను చేశామన్నారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
28 ఏప్రిల్
2025



# అక్షయ తృతీయకు గోల్డ్ కొనలా..



అక్షయ తృతీయ రోజు వస్తే చాలు, అనేక మంది కూడా బంగారం కొనుగోలు చేయాలని భావిస్తారు. వేదాలు, పురాణాల ప్రకారం, సంపద, ఐశ్వర్యం పొందడానికి ఈరోజు మంచిదని చెబుతుంటారు. కానీ సంపదను ఆకర్షించే ఈ రోజున గోల్డ్ కొనడం ప్రస్తుతం ఎక్కువగా చర్చించబడే విషయంగా మారిపోయింది. ఎందుకంటే పసిడి ధరలు ఇప్పుడు దాదాపు లక్షకు చేరి మళ్లీ కొంత తగ్గుముఖం పట్టాయి. ఇలాంటి సమయంలో గోల్డ్ కొనుగోలు చేయాలా వద్దా, కొంటే ఎలాంటి పసిడి తీసుకోవాలనే విషయాలను ఇక్కడ తెలుసుకుందాం.

**ప్రస్తుత ధరలు..**

ప్రస్తుతం ఏప్రిల్ 27, 2025న హైదరాబాద్‌లో 24 క్యారెట్ల గోల్డ్ ధర రూ.98,240 (10 గ్రాములకు) గా ఉంది. అయితే, ఈ ధర అక్షయ తృతీయ (ఏప్రిల్ 30న) సందర్భంగా తగ్గుతుందా, లేదంటే పెరుగుతుందా అని అనేక మంది ఆసక్తితో ఎదురు చూస్తున్నారు. ధరలు తగ్గింతే కొనుగోలు చేయాలని పలువురు చూస్తుండగా, మరికొంత మంది మాత్రం పెరిగినా కూడా మంచి రోజు కాబట్టి కొంత వరకు కొనుగోలు చేస్తామని చెబుతున్నారు. ప్రతి ఏటా కూడా అక్షయ తృతీయ రోజు అలవాటుగా గోల్డ్ కొనుగోలు చేసేవారు సైతం ఈసారి ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**ధరల మార్పు..**

గత వారం (ఏప్రిల్ 18, 2025) 24 క్యారెట్ల గోల్డ్ ధర రూ.97,580 (10 గ్రాములకు)గా ఉంది. అంటే పది రోజుల్లో ధరలో రూ.660 పెరుగుదల వచ్చింది. మరోవైపు గత నెల (మార్చి 20, 2025)న 24 క్యారెట్ల గోల్డ్ ధర రూ.89,320 (10 గ్రాములకు) గా ఉంది . ఈ ధర నెల రోజుల్లో రూ.8,920 పెరుగుదలతో ప్రస్తుతం రూ.98,240కి చేరుకుంది. రానున్న రోజుల్లో మాత్రం ఈ ధరలు మరింత పెరుగుతాయని నిపుణులు చెబుతున్నారు.

**కొనుగోలు చేయాలా, వేచి ఉండాలా**

అక్షయ తృతీయ పండుగ సందర్భంగా గోల్డ్ ధరలు సాధారణంగా పెరుగుతాయి. అయినప్పటికీ ఈ సీజన్‌లో కొనుగోలు చేయడం మంచిదని భావిస్తారు. కానీ ప్రస్తుత ధరలు, భవిష్యత్తులో రేట్లు పెరిగే అవకాశాలను పరిగణలోకి తీసుకుని కొనుగోలు చేయాలని నిపుణులు చెబుతున్నారు.

గత వారం, గత నెలలో ట్రెండ్ కొనసాగే అవకాశం ఉన్నందున ఆఫర్లను తెలుసుకుని కొనుగోలు చేయవచ్చని అంటున్నారు. అంతేకాదు కొనుగోలు చేసే విషయంలో మీ ఆర్థిక పరిస్థితి, భవిష్యత్తులో ధరల పెరుగుదల వంటి అంశాలను పరిగణలోకి తీసుకోవాలని చెబుతున్నారు. భారీగా ధరలు పెరిగితే కొంత రోజులు వేచి చూడడం మంచిదంటున్నారు. దీంతోపాటు గోల్డ్ కొనుగోలు చేసే సమయంలో హాల్‌మార్క్ ఉన్న వాటిని చూసి తీసుకోవాలని సూచిస్తున్నారు.



## ఏసీ చల్లదనంతో సమస్యా

వేసవిలో మండే ఎండల నుంచి ఉపశమనం పొందేందుకు ఇళ్లలో ఎయిర్ కండిషనర్‌లను వాడతాం. కానీ కొంతమందికి ఏసీ చల్లదనం సరిపడక తలనొప్పి, చర్మం పొడిబారడం, కళ్ల దురద, జలుబు, గొంతు పట్టేయడం లాంటి సమస్యలు తలెత్తుతాయి. కనుక ఏసీని ఉపయోగించేటప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే ఈ సమస్యల నుంచి బయటపడవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

ఏసీ ఫిల్టర్లలో ఎక్కువగా దుమ్ము చేరుతూ ఉంటుంది. ఏసీని ఉపయోగిస్తున్నప్పుడు ఈ దుమ్ము కణాలు వాటిలోని హానికారక బ్యాక్టీరియా గది అంతటా వ్యాపిస్తాయి. గదిలోకి రాగానే ఇవి శ్వాసకోశాల్లోకి చేరి జలుబు, తుమ్ములు, దగ్గు లాంటి సమస్యలను కలిగిస్తాయి. తరచూ ఏసీని, ఫిల్టర్లను శుభ్రం చేస్తూ ఉంటే వీటిని అధిగమించవచ్చు.

ఏసీ వేసి ఉన్న గదిలో ఉష్ణోగ్రత చాలా తక్కువగా ఉంటుంది. ఎక్కువసేపు ఇలాంటి చల్లని వాతావరణంలో గడపడం వల్ల శరీర ఉష్ణోగ్రత తగ్గుతుంది. దీంతో రోగనిరోధక వ్యవస్థ బలహీనమవుతుంది. తలనొప్పి, ముక్కు దిబ్బడ, కళ్ల దురద వస్తుంటాయి. చర్మం పొడిబారుతుంది కూడా. గదిలో చల్లదనం మరీ ఎక్కువగా కాకుండా మధ్యమంగా ఉండేలా ఏసీ ఉష్ణోగ్రతను నియంత్రిస్తే ఈ సమస్యలు రావు.

%ఏసీ గదిలో ఉన్నప్పటికీ శరీరం తేమను కోల్పోతూ ఉంటుంది. దాహం అనిపించకపోయినా తరచూ మంచి నీళ్లు తాగుతూ ఉండాలి. రాత్రి పూట పడుకునే ముందు గదిలో హ్యూమిడిఫైయర్‌ను వాడడం మంచిది. అలాగే ఏసీ టైమర్ పెట్టుకుంటే నిర్జలీకరణ సమస్యలు రావు.గదిలో ఏసీ వేసినప్పుడు సాధారణంగా తలుపులు, కిటికీలు మూసి ఉంచుతాం. దీనివల్ల గదిలో ఆక్సిజన్ స్థాయి తగ్గుతుంది. ఫలితంగా శ్వాసకోశ సమస్యలు తలెత్తుతాయి. కనీసం రెండు గంటలకు ఒకసారి అయిదు నిమిషాలపాటు కిటికీలు, తలుపులు తెరచి ఉంచితే గదిలో తాజాదనం విస్తరిస్తుంది. ఏసీ గాలి నేరుగా శరీరాన్ని తాకితే తలనొప్పి వస్తుంది. జలుబు చేస్తుంది కూడా. ఏసీ గాలి నేరుగా కాకుండా ఓ పక్కకు ప్రసరించేలా ఏర్పాటు చేసుకుంటే గది మొత్తం మెల్లగా చల్లబడి హాయిగా అనిపిస్తుంది. ఏసీలో స్వింగ్ ఫీచర్‌ని ఉపయోగించుకోవడం మంచిది.

## పిఎస్ యూ షేర్లు కురిపించెన్ సిరులు

### ఐపీఓ మదుపరులకు భారీ లాభాలు

### మజ్‌గాన్ డాక్ ఐపీఓలో బంపర్ రాబడులు

న్యూఢిల్లీ: పబ్లిక్ ఇష్యూకి (ఐపీఓ) వచ్చిన కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు చరిత్ర తిరగ రాస్తున్నాయి. ఈ కంపెనీల ఐపీఓలు, ప్రైవేటు కంపెనీల ఐపీఓలను మించి మదుపరులకు లాభాలు పంచాయి. 2017 మే నుంచి ఇప్పటి వరకు ఐపీఓకి వచ్చిన 18 సీపీఎసయూల్లో మూడు బీమా కంపెనీల ఐపీఓలు తప్ప, మిగతా 15 సీపీఎసయూల ఐపీఓలు మదుపరులకు బంపర్ లాభాలు పంచాయి. 2020 అక్టోబరులో ఐపీఓకు వచ్చిన మజ్‌గాన్ డాక్ షిప్‌బిల్డర్స్ ఐపీఓలో ఇన్వెస్ట్ చేసిన వారైతే ఇప్పటి వరకు 37 రెట్ల లాభాలు కళ్ల జూశారు. రైల్ వికాస్ నిగం లిమిటెడ్ (ఆర్‌వీఎన్‌ఎల్), గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ అండ్ ఇంజినీర్స్ లిమిటెడ్ (జీఆర్‌ఎసఈఎల్), ఐఆర్‌సీటీసీ ఐపీఓలూ మదుపరులకు వెయ్యి శాతానికిపైగా లాభాలు పంచాయి.

అగ్రస్థానంలో మజగాన్ డాక్: రూ.145 ధరతో జారీ అయిన మజ్‌గాన్ డాక్ షిప్‌బిల్డర్స్ షేర్లు ఈ నెల 25న బీఎసఈలో రూ.2,640.75 వద్ద ము-ంగిశాయి. రూ.10 ముఖ విలువతో జారీ చేసిన ఈ షేర్లను కంపెనీ గత ఏడాది డిసెంబరులో రూ.5 ముఖ విలువ ఉండే రెండు షేర్లుగా విభజించింది. ఐపీఓ సమయంలో ఉన్న రూ.10 ముఖ విలువనే పరిగణనలోకి తీసుకుంటే ప్రస్తుతం మజగాన్ డాక్ షేర్ల ఉధర రూ.5,281.5. అంటే ఇష్యూ ధరతో పోలిస్తే ప్రస్తు తం ఈ షేర్లు ఒక్కోటి రూ.5,136.5 లాభంతో ట్రేడవుతున్నాయి.

**ఇతర పీఎసయూలు**

రూ.118 ధరతో 2017లో మార్కెట్‌కు వచ్చిన గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ కంపెనీ షేర్లు ప్రస్తుతం రూ.1,616.80 వద్ద ట్రేడవుతున్నాయి. 2017లో రూ.432 ధరతో జారీ చేసిన కొచ్చిన్ షిప్‌యార్డు షేర్లు ప్రస్తుతం 590 శాతం లాభంతో రూ.2,979.7 వద్ద ట్రేడవుతున్నాయి. రైల్వే కంపెనీల ఐపీఓలూ మదుపరులకు లాభాలు పంచడంలో ప్రభుత్వ రంగ షిప్పింగ్ కంపెనీలతో పోటీపడుతున్నాయి. 2019లో రూ.19 వద్ద లిస్టయిన ఆర్‌వీఎన్‌ఎల్ షేర్లు గతవారం 1866 శాతం లాభంతో రూ.373.6 వద్ద ట్రేడయ్యాయి. రూ.320తో జారీ చేసిన ఐఆర్‌సీటీసీ షేర్లూ గత వారం ఇష్యూ ధరతో పోలిస్తే 1,110 శాతం లాభంతో రూ.3,872.75 వద్ద ట్రేడయ్యాయి. రైట్స్, ఇర్కాన్, రైల్‌టెల్, ఐపీఓలూఐ మదుపరులకు ఇష్యూ ధరతో పోలిస్తే 225 నుంచి 243 శాతం లాభాలు పంచాయి. హెచ్‌ఏఎల్, బీడీఎల్, మిధానీ కంపెనీల ఐపీఓలూ మదుపరులకు 227 నుంచి 605 శాతం వరకు లాభాలు పంచాయి.



## బీమా సవరణ బిల్లుపై కీలక అప్‌డేట్.. ఇకపై గట్టి పోటీ

భారత బీమా రంగంలో కొత్త కొత్త మార్పులు రానున్నాయి. అవును రాబోయే రోజుల్లో మరిన్ని ప్రైవేటు పెట్టుబడులు రానున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల పరిమితిని 74 శాతం నుంచి 100 శాతానికి పెంచే ప్రతిపాదనతో ఉన్నారు. అందుకు సంబంధించిన బీమా సవరణ బిల్లు త్వరలో పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ప్రవేశించనున్నట్లు సమాచారం. ఇప్పటికే ముసాయిదా సిద్ధంగా ఉంది. త్వరలో కేబినెట్ ఆమోదానికి పంపనున్నారు. ఆ తర్వాత బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే ప్రక్రియ మొదలవుతుంది.

**ఈ మార్పుల వెనుక ఉద్దేశం ఏంటి**

బీమా రంగాన్ని మరింత బలోపేతం చేయడం, గ్లోబల్ పెట్టుబడులను ఆకర్షించడం, వ్యాపార అవకాశాలు విస్తరించడం ప్రధాన లక్ష్యం. ఇకపోతే, వినియోగదారులకు కూడా మరిన్ని ఆఫర్లు ఉంటాయి. ప్రైవేటు పెట్టుబడులు పెరిగితే, ఇంకొన్ని కొత్త కంపెనీలు మార్కెట్లోకి వస్తాయి. తద్వారా వినియోగదారులు మెరుగైన సేవలను పొందడంతోపాటు ఆఫర్లు పొందే ఛాన్సుంది.



**బడ్జెట్ నుంచి మొదలైన మార్పు**

2024 బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించిన ఈ ప్రతిపాదన ఇప్పుడు కార్యరూపం దాల్చబోతోంది. ఇది ఆర్థిక రంగాన్ని ఆధునీకరించే విస్తృత సంస్కరణల భాగంగా తీసుకొస్తున్నారు. ప్రస్తుతం ఉన్న 74 శాతం FDI పరిమితిని పూర్తిగా తొలగించి, విదేశీ కంపెనీలు భారత బీమా కంపెనీలలో 100 శాతం వాటాను స్వాధీనం చేసుకునే అవకాశం ఏర్పడుతుంది.

**పాలసీదారుల ప్రయోజనాలపై దృష్టి**

ఈ ప్రతిపాదిత మార్పులు కేవలం పెట్టుబడులకు సంబంధించి కాకుండా, పాలసీదారుల భద్రత, సేవల నాణ్యత వంటి అంశాలపై దృష్టి పెడతాయి. ఎటూ చూసినా, బీమా మార్కెట్లో పోటీ పెరగడం వల్ల వినియోగదారులకు ఎక్కువ ఎంపికలు, తక్కువ ప్రీమియం, వేగవంతమైన క్లెయిమ్ ప్రాసెసింగ్ వంటి ప్రయోజనాలు వచ్చే ఛాన్సుంటుంది.

**కీలక మార్పులు**

ప్రస్తుతం దేశంలో: 25 జీవిత బీమా సంస్థలు, 34 జనరల్ బీమా సంస్థలు ఉన్నాయి. వీటితో పాటు కొత్త కంపెనీలు మార్కెట్‌లోకి రావడం ద్వారా మౌలిక సదు-పాయాల పెరుగుతాయి. దీంతోపాటు సాంకేతికత ఆధారిత సేవలు అందుబాటులోకి రావడం ద్వారా రాష్ట్రాల, గ్రామీణ ప్రాంతాల వరకు బీమా సేవలు మరింత విస్తరించే అవకాశం ఉంది.



## మా ఆర్థిక వ్యవస్థ భేష్

### పెట్టుబడులతో రండి ఆర్‌బీఐ గవర్నర్

వాషింగ్టన్: కొన్ని సమస్యలున్నా, భారత ఆర్థిక వ్యవస్థ భవిష్యత్‌కు ఢోకా లేదని ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా అన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని భారత్‌లో పెట్టుబడులుపెట్టేందుకు ముందుకు రావాలని అమెరికా పారిశ్రామిక వర్గాలను కోరారు. సిఐఐ–భారత అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్య వేదిక ఏర్పాటు చేసిన సదస్సులో మాట్లాడుతూ అంతర్జాతీయ ఫైనాన్సియల్ మా ర్కెట్లలో ఆటుపోట్లు, అనిశ్చితి ఉన్నా ఈ ఆర్థిక సంవత్సరంలో కూడా భారత్ 6.5 శాతం వృద్ధిని నమోదు చేస్తుందన్నారు. ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో మరే దేశ జీడీపీ ఈ స్థాయిలో పెరిగే అవకాశం లేదని చెప్పార్ను. స్థిరమైన ప్రభుత్వ విధానాలే ఇందుకు కారణమని చెప్పారు. దీర్ఘకాలిక లాభాలు, అవకాశాలు కోరుకునే పారిశ్రామికవేత్తలకు భారత్ చక్కటి మార్కెట్ అని స్పష్టం చేశారు.

భాగస్వామి కూడా : విదేశీ పెట్టుబడులకు భారత్ గమ్య స్థానమేగాక, వారి ఐశ్వర్యంలోనూ భాగస్వామిగా ఉంటుందని మల్హోత్రా అన్నా రు. ఈ భాగస్వామ్యం భారత భవిష్యత్‌నే గాక ప్రపంచ భవిష్యత్‌నూ మార్చివేస్తుందన్నారు. 2010–19 మధ్యకాలంలో భారత జీడీపీ ఏటా సగటున 6.6 శాతం చొప్పున పెరిగితే గత నాలుగేళ్లలో ఏటా సగటున 8.2 శాతం వృద్ధిరేటు సాఽధించిన విషయాన్ని గుర్తు చేశారు. త్వరలోనే భారత్ మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవిర్భవించబోతోందని చెప్పారు.

## ఎలక్ట్రానిక్స్ విడిభాగాల తయారీలోకి డిక్సన్ టెక్నాలజీస్

**న్యూఢిల్లీ:** డిక్సన్ టెక్నాలజీస్ ఎలక్ట్రానిక్స్ విడిభాగాల తయారీలోకి కూడా ప్రవేశిస్తోంది. అయితే తాము ప్రస్తుతం ఉత్పత్తి చేసే విడిభాగాలను తమ అవసరాలకే వినియోగిస్తామని, తదుపరి దశలో ఎగుమతులపై దృష్టి పెడతామని కంపెనీ సీఈఓ అతుల్ లాల్ తెలిపారు. తమ కంపెనీ భవిష్యత్ వృద్ధికి ఈ విడిభాగాల తయారీ మంచి అవకాశంగా నిలుస్తుందని చెప్పారు. తాము ఇప్పటికే డిస్‌ప్లే మాడ్యూల్స్‌పై ఒక ప్రాజెక్టును ప్రారంభించామని వెల్లడిస్తూ కెమెరా మాడ్యూల్స్, మెకానికల్ ఎంక్లోజర్స్, లిథియం అయాన్ బ్యాటరీలు వంటి విభిన్న రంగాల్లో గల అవకాశాలను మదింపు చేస్తున్నట్టు తెలిపారు.

## ఎఫ్‌పీఐ పెట్టుబడి రూ.17,425 కోట్లు

**న్యూఢిల్లీ:** విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు గత వారంలో రూ.17,425 కోట్లు భారత ఈక్విటీ మార్కెట్లో ఇన్వెస్ట్ చేశా రు. ప్రపంచ మార్కెట్ల నుంచి అందిన సానుకూల సంకేతాలతో పాటు స్థూల ఆర్థిక మూలాలు పటిష్ఠంగా ఉండ డం ఇందుకు దోహదపడింది. అంతకు ముందు వారంలో కూడా వారు రూ.8,500 కోట్లు భారత ఈక్విటీల్లో పెట్టుబడిగా పెట్టారు. డిపాజిటరీల వద్ద అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం ఎఫ్‌పీఐలు ఏప్రిల్ నెలలో ఇప్పటివరకు రూ.5,678 కోట్లు ఉపసంహరించారు. దీంతో ఈ ఏడాది ఇప్పటివరకు వారు తరలించుకుపోయిన నిధుల విలువ రూ.1.22 లక్షల కోట్లకు చేరింది. ప్రపంచంలో వాణిజ్య ఉద్రిక్తతలు తగ్గడం ఇన్వెస్టర్ సెంటిమెంట్‌ను బలపరిచిందని పరిశీలకులంటున్నారు.

## సెల్ లో బందీలైతే మెదడు మొద్దుబారుతుంది

**తాజా సర్వేలో వెల్లడి**

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 27:** జీవితాన్ని ఎంతో సులభతరం చేసి, సమయాన్ని ఆదా చేస్తున్న సెల్‌ఫోన్లతో లాభం ఎంతుందో నష్టం కూడా అంతకన్నా ఎక్కువగా ఉందని సర్వేలు హెచ్చరిస్తున్నాయి. పిల్లలైతే సెల్‌ఫోన్‌లో బందీలవుతున్నారు. స్క్రీన్‌లను విడిచిపెట్టడం లేదు. దీంతో నిద్రలేమి, కుంగుబాటు వంటి తీవ్ర సమస్యలు తలెత్తుతాయని ఇప్పటికే రుజువైంది. ఇది మానవ మేధోశక్తిపైనా ప్రభావం చూపుతుందని, ఫలితంగా ఐక్యూ స్థాయి తగ్గిపోతుందని మిషిగాన్ విశ్వవిద్యాలయం నిర్వహించిన 'మానిటరింగ్ ది ఫ్యూచర్' సర్వేలో వెల్లడైంది. సర్వే సమాచారాన్ని ఫైనాన్షియల్ టైమ్స్ ప్రచురించింది. స్క్రీన్ టైం అధికమైతే టీనేజర్లు, యువకుల్లో వివేచన సామర్థ్యం తగ్గుతున్నట్టు తేలింది. ఏకాగ్రత లోపించడం, జ్ఞాపకశక్తి మందగించడం, ప్రాథమిక స్థాయి తార్కిక శక్తి లేకపోవడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. మెదడు పనితీరులోనే మార్పులున్నట్టు గుర్తించారు. గతంలో పిల్లలు, టీనేజర్లు పుస్తకాలు, చిన్న కథలు చదివేవారు. ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్ వచ్చాక పుస్తక పఠనంపై ఆసక్తి కనబరిచేవారే లేరు. అమెరికాలో జరిగిన సర్వే ప్రకారం 2012లో 45శాతం మందికి పుస్తక పఠనం అలవాటుగా ఉండేది. 2021 నాటికి అది 38 శాతానికి పడిపోయింది. ప్రతిదీ ఒక క్లిక్, స్వైప్ ద్వారా లభిస్తుండడంతో దేన్నీ గుర్తించుకోవాల్సిన అవసరం లేకపోయింది. దాంతో స్పష్టంగా ఆలోచించే సామర్థ్యాన్ని కోల్పోతున్నారు.



ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
28 ఏప్రిల్
2025





# టాప్ లేపిన బెంగళూరు

## ఆదుకున్న క్రునాల్, కోహ్లీ

## ఢిల్లీపై ఆరు వికెట్లతో విజయం



న్యూఢిల్లీ: తాజా సీజన్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) అదరగొడుతోంది. మరీ ముఖ్యంగా ప్రత్యర్థుల సొంత మైదానాల్లో తిరుగులేని ఆధిపత్యాన్ని చాటుకుంటూ తొలి టైటిల్ కోసం దూసుకెళ్తోంది. ఆదివారం ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 163 పరుగుల ఛేదనలో అనూహ్యంగా తడబాటుకు గురైనా ఆర్‌సీబీ ఒత్తిడికి లోనుకాలేదు. క్రునాల్ పాండ్యా (47 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్సర్లతో 73 నాటౌట్) సమయోచిత ఆటతీరుకు, ఛేజింగ్ రారాజు విరాట్ కోహ్లీ (47 బంతుల్లో 4 ఫోర్లతో 51) సహకారం అందించగా ఢిల్లీ క్యాపిటల్స్‌పై 6 వికెట్ల తేడాతో ఆర్‌సీబీ నెగ్గింది. దీంతో 14 పాయింట్లతో పట్టికలో టాప్‌నకు చేరి ప్లేఆఫ్స్ ఆశలను మరింత మెరుగుపర్చుకుంది. ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా ఢిల్లీ 20 ఓవర్లలో 8 వికెట్లకు 162 పరుగులు చేసింది. రాహుల్ (41), స్టబ్స్ (34), పోరెల్ (28) మాత్రమే రాణించారు. భువనేశ్వర్‌కు 3, హాజెల్‌వుడ్‌కు 2 వికెట్లు దక్కాయి. ఛేదనలో బెంగళూరు 18.3 ఓవర్లలో 4 వికెట్లకు 165 పరుగులు చేసి గెలిచింది. టిమ్ డేవిడ్ (5 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్‌తో 19 నాటౌట్) చివర్లో మెరిశాడు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా క్రునాల్ నిలిచాడు.

**శతక భాగస్వామ్యంతో..:**

ఆర్‌సీబీ ముందు ఓ మాదిరి ఛేదనే అనిపించినా.. డీసీ బౌలర్లు ఆదిలోనే ఝలక్ ఇచ్చారు. ఓవర్లు సాగుతున్న కొద్దీ లక్ష్యం కఠినంగా మారుతుండడంతో ఫలితంపై ఉత్కంఠ ఏర్పడింది. అయితే ఓపెనర్ విరాట్‌కు తోడు క్రునాల్ అద్భుత ఆటతీరుతో శతక భాగస్వామ్యం నమోదు చేసి జట్టును గట్టెక్కించారు. చివర్లో టిమ్ డేవిడ్ (19 నాటౌట్) ధమాకా ఆటతీరుతో మురిపించాడు. ఓపెనర్ బెథెల్ (12), దేవ్‌దత్ (0)లను స్పిన్నర్ అక్షర్ మూడో ఓవర్‌లోనే పెవిలియన్‌కు చేర్చి షాకిచ్చాడు. కాసేపటికే కెప్టెన్ రజత్ (6)ను కరుణ్ రనౌట్ చేయడంతో ఆర్‌సీబీ తీవ్ర ఒత్తిడిలో పడింది. అటు పవర్‌ప్లేలో కేవలం 35/3 స్కోరుకే పరిమితం కావడంతో ఛేదన కష్టమే అనిపించింది. కానీ ఈ ఇబ్బందికర పరిస్థితిలో విరాట్-క్రునాల్ జోడీ నిలబడింది. వికెట్‌ను కోల్పోకూడదనే లక్ష్యంతో వీరు ఆచితూచి ఆడారు. అటు సాధించాల్సిన రన్‌రేట్ పెరుగుతున్నా బెదరలేదు. 13వ ఓవర్‌లో క్రునాల్ రెండు సిక్సర్లతో కాస్త కదలిక వచ్చింది. అలాగే 38 బంతుల్లో అతడు కెరీర్‌లో రెండో ఫిఫ్టీని పూర్తి చేశాడు. అటు విరాట్ సైతం తన హ్యాట్రిక్ హాఫ్ సెంచరీతో ఆకట్టుకున్నాడు. 17వ ఓవర్‌లో క్రునాల్ 2 ఫోర్లతో 12 రన్స్ సమకూరాయి. ఇక తర్వాతి ఓవర్‌లోనే విరాట్ వెనుదిరగడంతో మూడో వికెట్‌కు 119 పరుగుల భాగస్వామ్యం ముగిసినప్పటికే ఆర్‌సీబీ విజయం దరిదాపుల్లోకి వచ్చింది. 12 బంతుల్లో 17 రన్స్ కావాల్సిన వేళ టిమ్ డేవిడ్ 6,4,4,4తో 9 బంతులుండగానే మ్యాచ్‌ను ముగించాడు.

**మెరుపుల్లేవ్..:**

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీని ఆర్‌సీబీ బౌలర్లు గణనీయంగా కట్టడి చేశారు. అటు స్లో వికెట్ కావడంతో డీసీ బ్యాటర్లు పరుగులు సాధించేందుకు తంటాలు పడ్డారు. దీనికి తోడు వరుస విరామాల్లో వికెట్లు కోల్పోవడంతో రిస్క్ తీసుకోలేక ఒత్తిడిలో పడింది. మధ్య ఓవర్లలో రాహుల్ క్రీజులో నిలిచినా భారీ షాట్లు ఆడలేకపోయాడు. అయితే చివరి మూడు ఓవర్లలో స్టబ్స్ వీరవిహారంతో ఢిల్లీ గౌరవప్రదమైన స్కోరందుకుంది. ఆరంభంలో ఓపెనర్ పోరెల్ మాత్రం ధాటిని కనబర్చాడు. తొలి బంతినే ఫోర్‌గా మల్చిన తను మూడో ఓవర్‌లో రెండు సిక్సర్లతో 17 రన్స్ రాబట్టాడు. కానీ అతడి దూకుడుకు నాలుగో ఓవర్‌లోనే బ్రేక్ పడింది. తర్వాతి ఓవర్‌లోనే కరుణ్ (4) కూడా వెనుదిరిగినా పవర్‌ప్లేలో జట్టు 52/2తో ఫర్వాలేదనిపించింది. అనంతరం డీసీ ఇన్నింగ్స్ నత్తనడకన సాగింది. స్పిన్నర్లు సుయాష్, క్రునాల్ కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో బౌండరీలు రావడం గగనంగా మారింది. రాహుల్, డుప్లెసి మధ్య మూడో వికెట్‌కు 28 రన్స్ జత చేరాయి. అక్షర్ (15) ఉన్నంతసేపు వేగం కనబర్చాడు. 17వ ఓవర్‌లో రాహుల్, అశుతోష్ (2)ల వికెట్లను తీసి భువీ గట్టి దెబ్బ తీశాడు. అప్పటికి స్కోరు 120/6. ఈ దశలో 150 కూడా అతికష్టంగా మారింది. కానీ 18వ ఓవర్‌లో విప్రజ్ (12) సిక్సర్, స్టబ్స్ ఫోర్‌తో 17 రన్స్ సమకూరగా, 19వ ఓవర్‌లో స్టబ్స్ మరింత చెలరేగి 4,6,4తో 19 రన్స్ రాబట్టాడు. కానీ చివరి ఓవర్‌లో భువీ ఆరు పరుగులే ఇచ్చి స్టబ్స్ వికెట్ తీయగా.. విప్రజ్ రనౌటయ్యాడు.





## భారత్ ఆల్‌రౌండ్ షో

### ముక్కోణపు వన్డే సిరీసలో బోణీ

### 9 వికెట్లతో శ్రీలంక చిత్తు

కొలంబో: ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టిన భారత మహిళలు ముక్కోణపు వన్డే టోర్నీలో ఘనమైన బోణీ కొట్టారు. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో తొమ్మిది వికెట్లతో శ్రీలంకను చిత్తు చేశారు. అంతర్జాతీయ అరంగేట్రం చేసిన తెలుగు స్పిన్నర్ శ్రీచరణి (2/26) రెండు వికెట్లతో సత్తా చాటింది. వర్షం వల్ల ఈ మ్యాచ్‌ను 39 ఓవర్లకు కుదించారు. టాస్ కోల్పోయి తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక 38.1 ఓవర్లలో 147 పరుగులకు కుప్పకూలింది. హాసినీ పెరీరా (30), కవిషా దిల్హారి (25), అనుష్క సంజీవని (22) ఫర్వాలేదనిపించారు. స్నేహ్ రాణా మూడు, దీప్తీ శర్మ రెండు వికెట్లు పడగొట్టారు. ఛేదనలో టాపార్డర్ విజృంభించడంతో భారత్ కేవలం 29.4 ఓవర్లలో 149/1 స్కోరు చేసి సునాయాసంగా నెగ్గింది. ఓపెనర్లు ప్రతికా రావల్ (50 నాటౌట్), మంధాన (43), హర్లీన్ డియోల్ (48 నాటౌట్) రాణించారు. ప్రతిక 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచింది. భారత్ తదుపరి మ్యాచ్‌లో మంగళవారం దక్షిణాఫ్రికాతో తలపడుతుంది.

**ఛేదన సునాయాసంగా..:**

స్వల్ప స్కోరు ఛేదనలో ఓపెనర్లు ప్రతిక, మంధాన అద్భుత ఆరంభం ఇచ్చారు. ఏడో వన్డే మాత్రమే ఆడుతున్న ప్రతిక రెండు కీలకమైన భాగస్వామ్యాలు నెలకొల్పింది. మంధానాతో కలిసి తొలి వికెట్‌కు 54, అనంతరం హర్లీన్ డియోల్‌తో కలిసి రెండో వికెట్‌కు అభేద్యంగా 95 రన్స్ జత చేసింది. ఈక్రమంలో వన్డేలలో వరుసగా నాలుగో హాఫ్ సెంచరీని ప్రతిక నమోదు చేసింది.

**బౌలర్లు భళా:**

అంతకుముందు భారత స్పిన్నర్ల ధాటికి శ్రీలంక బ్యాటర్లు పరుగులు చేయడం కష్టమైంది. వన్డే అరంగేట్రం చేసిన పేసర్ కష్వీ గౌతమ్ వికెట్ సాధించకపోయినా పొదుపైన బౌలింగ్‌తో ఆకట్టుకుంది. భారీ వర్షంతో మ్యాచ్ మూడు గంటలు ఆలస్యంగా ప్రారంభం కాగా..పిచ్‌పై తేమను సద్వినియోగం చేసుకున్న భారత బౌలర్లు ప్రత్యర్థిని పరుగులు చేయకుండా నిరోధించారు.

**సంక్షిప్తస్కోర్లు:**

శ్రీలంక: 38.1 ఓవర్లలో 147 ఆలౌట్ (హాసినీ పెరీరా 30, కవిషా దిల్హారి 25, అనుష్క సంజీవని 22, స్నేహ్ రాణా 3/31, దీప్తీశర్మ 2/22, శ్రీచరణి 2/26)బీ భారత్: 29.4 ఓవర్లలో 149/1 (ప్రతికా రావల్ 50 నాటౌట్, హర్లీన్ డియోల్ 48 నాటౌట్, మంధాన 43, ఇనోకా రణవీర 1/32).

# ముంబై వరుసగా ఐదో విజయం

## సూర్య, రికెల్టన్ అర్ధ శతకాలు

## 54 పరుగులతో లఖ్‌నవూ చిత్తు

## బుమ్రాకు 4 వికెట్లు

ముంబై: జోరుమీదున్న ముంబై ఇండియన్స్ వరుసగా ఐదో విజయంతో ప్లేఆఫ్స్ దిశగా దూసుకెళ్తోంది. ర్యాన్ రికెల్టన్ (32 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్స్‌లతో 58), సూర్యకుమార్ (28 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లతో 54) హాఫ్ సెంచరీలతోపాటు బుమ్రా (4/22) నిప్పులు చెరగడంతో.. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో ముంబై 54 పరుగులతో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌ను మట్టికరిపించింది. తొలుత ముంబై 20 ఓవర్లలో 215/7 స్కోరు చేసింది. మయాంక్, అవేశ్ చెరో 2 వికెట్లు తీశారు. ఛేదనలో లఖ్‌నవూ ఓవర్లన్నీ ఆడి 161 పరుగులకు ఆలౌటైంది. ఆయుష్ బదోని (35), మిచెల్ మార్ష్ (34) ఫర్వాలేదనిపించారు. ట్రెంట్ బౌల్ట్ మూడు వికెట్లు దక్కించుకోగా.. ఆల్‌రౌండ్ షో చేసిన విల్ జాక్స్ (29, 2/18) 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు.

**పెవిలియన్‌కు క్యూ:**

ముంబై పేసర్లు బుమ్రా, బౌల్ట్ వికెట్ల వేటలో పోటీపడడంతో.. లఖ్‌నవూ బ్యాటింగ్ పేకమేడను తలపించింది. రెండో వికెట్‌కు పూరన్ (27)తో కలసి 42 రన్స్ జోడించిన మార్ష్.. బదోనితో నాలుగో వికెట్‌కు 46 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకొనే ప్రయత్నం చేశాడు. అయితే, పూరన్, కెప్టెన్ రిషభ్ పంత్ (4)ను జాక్స్ ఒకే ఓవర్‌లో అవుట్ చేసి ఝలక్ ఇచ్చాడు. కాగా, ఓపెనర్ మార్‌క్రమ్ (9)ను స్వల్ప స్కోరుకే పెవిలియన్ చేర్చిన బుమ్రా.. 16వ ఓవర్‌లో మిల్లర్ (24), సమద్ (2), బిష్ణోయ్ (13) వికెట్లతో ప్రత్యర్థి వెన్నువిరిచాడు. మార్ష్, బదోనితోపాటు దిగ్వేష్ (1)ను అవు ట్ చేసిన బౌల్ట్.. లఖ్‌నవూ ఇన్నింగ్స్‌కు తెరదించాడు.

చెలరేగిన సూర్య: రికెల్టన్, సూర్య అర్ధ శతకాలతో.. ముంబై భారీ స్కోరు చేసింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ముంబైకి ఓపెనర్లు రికెల్టన్, రోహిత్ శుభారంభం అందించారు. ఫోర్‌తో ఖాతా తెరిచిన ఓపెనర్ రికెల్టన్.. రెండో ఓవర్‌లో ప్రిన్స్ బౌలింగ్‌లో 6,4,4తో చెలరేగాడు. అయితే, గాయం నుంచి పునరాగమనం చేసిన పేసర్ మయాంక్ వేసిన మూడో ఓవర్‌లో వరుసగా రెండు సిక్స్‌లు బాదిన మరో ఓపెనర్ రోహిత్ (12).. అదే ఓవర్‌లో స్లో బంతికి బోల్తాపడ్డాడు. దీంతో తొలి వికెట్‌కు 33 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అనంతరం క్రీజులోకి వచ్చిన విల్ జాక్స్ (29) కూడా రికెల్టన్‌తో పోటీపడి మరీ షాట్లు ఆడారు. ఆరో ఓవర్‌లో రికెల్టన్ 6,4,6తో 19 పరుగులు రాబట్టడంతో.. పవర్‌ప్లేను ముంబై 66/1తో మెరుగ్గా ముగించింది. అయితే, ఫిఫ్టీ పూర్తి చేసుకొన్న రికెల్టన్‌ను ప్రిన్స్ బౌల్డ్ చేసినా.. రెండో వికెట్‌కు 55 పరుగులు సమకూరాయి. ఈ దశలో క్రీజులోకి వచ్చిన సూర్య.. చిన్నచిన్న భాగస్వామ్యాలతో జట్టుకు మెరుగైన స్కోరు అందించాడు. జాక్స్‌ను ప్రిన్స్ బౌల్డ్ చేయగా.. తిలక్ వర్మ (6)ను బిష్ణోయ్, హార్దిక్ పాండ్యా (5)ను మయాంక్ వెనక్కిపంపారు. మరోవైపు అవేశ్ బౌలింగ్‌లో సిక్స్‌తో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకొన్న సూర్య.. ఆ తర్వాతి బంతికి అవుటయ్యాడు. చివరి ఓవర్లలో నమన్ ధిర్ (25 నాటౌట్), బోష్ (20) వేగంగా ఆడడంతో.. ముంబై స్కోరు 200 మార్క్ దాటింది.





**స్కోరుబోర్డు**

ముంబై: రికెల్టన్ (సి) బదోని (బి) రాఠీ 58, రోహిత్ (సి) ప్రిన్స్ (బి) మయాంక్ 12, జాక్స్ (బి) ప్రిన్స్ 29, సూర్యకుమార్ (సి) మార్ష్ (బి) అవేశ్ 54, తిలక్ (సి) ప్రిన్స్ (బి) బిష్ణోయ్ 6, హార్దిక్ (బి) మయాంక్ 5, నమన్ (నాటౌట్) 25, బాష్ (సి) పూరన్ (బి) అవేశ్ 20, చాహర్ (నాటౌట్) 1బీ ఎక్స్‌ట్రాలు: 5బీ మొత్తం: 20 ఓవర్లలో 215/7బీ వికెట్ల పతనం: 1-33, 2-88, 3-116, 4-137, 5-157, 6-180, 7-208బీ బౌలింగ్: మయాంక్ 4-0-40-2, ప్రిన్స్ 4-0-44-1, దిగ్వేష్ రాఠీ 4-0-48-1, బిష్ణోయ్ 4-0-41-1, అవేశ్ ఖాన్ 4-0-42-2.

లఖ్‌నవూ: మార్ష్ (సి) తిలక్ (బి) బౌల్ట్ 34, మార్‌క్రమ్ (సి) నమన్ (బి) బుమ్రా 9, పూరన్ (సి) సూర్య (బి) జాక్స్ 27, పంత్ (సి) కర్ణ్ శర్మ (బి) జాక్స్ 4, ఆయుష్ (సి) జాక్స్ (బి) బౌల్ట్ 35, మిల్లర్ (సి) బాష్ (బి) బుమ్రా 24, సమద్ (బి) బుమ్రా 2, బిష్ణోయ్ (బి) బాష్ 13, అవేశ్ (బి) బుమ్రా 0, ప్రిన్స్ (నాటౌట్) 4, దిగ్వేష్ (బి) బౌల్ట్ 1బీ ఎక్స్‌ట్రాలు: 8బీ మొత్తం: 20 ఓవర్లలో 161 ఆలౌట్‌బీ వికెట్ల పతనం: 1-18, 2-60, 3-64, 4-110, 5-135, 6-141, 7-142, 8-142, 9-157బీ బౌలింగ్: బౌల్ట్ 4-0-20-3, చాహర్ 3-0-38-0, బుమ్రా 4-0-22-4, జాక్స్ 2-0-18-2, కర్ణ్ శర్మ 2-0-25-0, హార్దిక్ 1-0-10-0, బాష్ 4-0-26-1.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
Roaming News




# రకుల్ సొగసు చూడ తరమా..!

రకుల్ ప్రీత్ సింగ్ మళ్లీ బిజీ అయ్యేందుకు ప్రయత్నాలు చేస్తోంది. టాలీవుడ్‌లో ఒకప్పుడు స్టార్ హీరోలకు సైతం డేట్లు ఇవ్వలేనంత బిజీగా సినిమాలు చేసిన విషయం తెల్సిందే. ఈమె కోసం నెలల తరబడి వెయిట్ చేసిన హీరోలు కూడా తెలుగు సినిమా ఇండస్ట్రీలో ఉన్నారు అంటే అతిశయోక్తి లేదు. అలాంటి స్టార్‌డం దక్కించుకున్న రకుల్ ప్రీత్ సింగ్ తక్కువ సమయంలోనే టాలీవుడ్‌కి దూరం అయింది. టాలీవుడ్ లో ఆఫర్లు తగ్గడంతో బాలీవుడ్‌లో ప్రయత్నాలు చేసింది. అయితే బాలీవుడ్‌లో వరుసగా ఆఫర్లు దక్కినా లక్ కలిసి రాకపోవడంతో అక్కడ కూడా ప్రస్తుతం పెద్దగా ఆఫర్లు లేవు. అయినా కూడా సోషల్ మీడియాలో ఈమె జోరు తగ్గడం లేదు. ప్రస్తుతం బాలీవుడ్‌లో ఈమె దే దే ప్యార్ దే 2 సినిమాలో నటిస్తోంది. 2019లో వచ్చిన దే దే ప్యార్ దే సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకున్న నేపథ్యంలో సీక్వెల్‌పై అంచనాలు ఉన్నాయి. మొదటి పార్ట్‌లో రకుల్ ప్రీత్ సింగ్‌కి నటిగా మంచి పేరును తెచ్చి పెట్టింది. అంతే కాకుండా రకుల్ అందాన్ని చూపించేందుకు కూడా స్కోప్ దక్కింది. ఇప్పుడు రకుల్ ప్రీత్ సింగ్‌కి పెద్దగా క్రేజ్ లేదు. అయినా కూడా రకుల్ ప్రీత్ సింగ్ సోషల్ మీడియాలో ఏ ఫోటోలు షేర్ చేసినా వైరల్ అవుతూనే ఉంటాయి. ఆకట్టుకునే అందంతో పాటు, మంచి ఫిజిక్ ఈమె సొంతం అంటూ ఉంటారు. అందుకే ఈమెను అత్యధికులు అభిమానిస్తూ ఉంటారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఈమెకు ఏకంగా 2.5 కోట్ల మంది ఫాలోవర్స్ ఉన్న విషయం తెల్సిందే.



# బ్రేకప్ స్టోరీల గురించి... ఎన్నో బాయ్ ఫ్రెండ్ అంటారు!

కమల్ హాసన్ వారసురాలు శృతి హాసన్ కెరీర్ ఆరంభం నుంచి తనకంటూ ప్రత్యేక ఇమేజ్‌ను సొంతం చేసుకునేందుకు ప్రయత్నిస్తూ వచ్చింది. తండ్రి పేరును వినియోగించుకుని ఆఫర్లు దక్కించుకోవడం లేదంటే, తండ్రి పేరును వినియోగించుకుని ఇండస్ట్రీలో నిలదొక్కుకునే ప్రయత్నం ఎప్పుడూ శృతి హాసన్ చేయలేదు. ఇండస్ట్రీలో ఆమె ఎంట్రీ ఇచ్చిన మొదటి సినిమాలోనే బికినీ ధరించడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షించింది. మొదటి హిట్ పడే వరకు తీవ్రమైన ఒత్తిడికి గురి అయినట్లుగా శృతి హాసన్ చెబుతూ ఉండేది. హీరోయిన్‌గానే కాకుండా ఇండస్ట్రీలో నాలుగు కాలల పాటు ఉండే విధంగా ఎప్పుడూ ఏదో విధంగా ప్రేక్షకుల ముందుకు రావాలని అనుకుంటాను అంటూ గతంలో శృతి హాసన్ చెప్పుకొచ్చింది. తాజాగా ప్రముఖ నేషనల్ మ్యాగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో శృతి హాసన్ పలు ఆసక్తికర విషయాలను షేర్ చేసుకుంది. ముఖ్యంగా తన ప్రేమ వ్యవహారాల గురించి, తన తల్లిదండ్రులు విడిపోయిన సమయంలో ఎదుర్కొన్న పరిణామాల గురించి, ఇండస్ట్రీలో ఎదుర్కొన్న పరిస్థితుల గురించి శృతి హాసన్ డెప్త్‌గానే చెప్పుకొచ్చింది. గతంలో ఎప్పుడూ చెప్పని విషయాలను ఈసారి శృతి హాసన్ షేర్ చేసుకోవడంతో ఆమె వ్యాక్యలు వైరల్ అవుతున్నాయి. శృతి హాసన్ వ్యక్తిగత విషయాల గురించి మాట్లాడిన ప్రతిసారీ ఆమె ప్రేమ వ్యవహారాల గురించి టాపిక్ వస్తుంది. ఆమె ఇప్పటికే రెండు మూడు సార్లు ప్రియుడికి బ్రేకప్ చెప్పింది. ఆఫ్ ది రికార్డ్ మరికొందరు కూడా ఉండి ఉ ఒడవచ్చు అంటారు. తాజాగా ఆ విషయం గురించి శృతి హాసన్ స్పందిస్తూ... నాతో ఎవరైనా కొత్త వ్యక్తి కనిపిస్తే చాలా మంది ఇతడు ఎన్నో బాయ్ ఫ్రెండ్ అని అడుగుతూ ఉంటారు. వారు ఆ నెంబర్ గురించి ఆలోచిస్తూ ఉంటారు, కానీ నేను మాత్రం నెంబర్ గురించి ఆలోచించను. నేను కోరుకునే ప్రేమ లభించే వరకు ఎన్ని సార్లు అయినా విఫలం అయ్యేందుకు సిద్ధంగా ఉన్నాను. ఒక వ్యక్తికి బ్రేకప్ అయినంత మాత్రాన తప్పుబట్టాల్సిన అవసరం లేదు. అంతే కాకుండా ప్రేమికులు ఇద్దరు బ్రేకప్ చెప్పుకున్నప్పుడు ఒకరిని ఒకరు తప్పుపట్టకూడదు. రిలేషన్ షిప్‌లో నిజాయితీగా ఉండాలని నేను అనుకుంటాను, అవతలి వారు మొదట నిజాయితీగా ఉన్నా ఆ తర్వాత ఉండక పోవచ్చు అంది. కోరుకునే ప్రేమ లభించే వరకు వెయిట్ చేస్తానంది.



# చీర కట్టులో కేతిక రొమాంటిక్..!

నితిన్ హీరోగా నటించిన 'రాబిన్‌హుడ్' సినిమాలో అదిదా సర్‌ప్రైజ్ అంటూ ఐటెం సాంగ్ చేసి అందరినీ నిజంగానే సర్‌ప్రైజ్ చేసిన ముద్దుగుమ్మ కేతిక శర్మ. ఆమె కాస్ట్యూమ్స్, మేకోవర్, డాన్స్ స్టెప్పులు ఇలా ప్రతి ఒక్కటీ మాస్ ఆడియన్స్‌కి నచ్చాయి. కేతిక శర్మ హీరోయిన్‌గా కెరీర్ ఆరంభంలో మంచి సినిమాల్లో నటించే అవకాశాలు దక్కించుకున్నప్పటికీ లక్ కలిసి రాకపోవడంతో తక్కువ సమయంకే హీరోయిన్‌గా ఆఫర్లు లేకుండా పోయాయి. హీరోయిన్‌గా ప్రస్తుతం ఈమె చేస్తున్న సినిమాలు పెద్దగా ఏమీ లేదు. అయినా కూడా ఈమెకు సోషల్ మీడియా ద్వారా మంచి గుర్తింపు దక్కింది. ఈమెకు ఇన్‌స్టాగ్రామ్‌లో ఏకంగా 3.5 మిలియన్‌ల ఫాలోవర్స్ ఉన్న విషయం తెల్సిందే.

సినిమాల్లో అందంగా కనిపించడంతో పాటు, నటనతో మెప్పించే కేతిక శర్మ సోషల్ మీడియాలో పూర్తి స్థాయిలో అందాల ఆరబోతతో ఆకట్టుకుంటూ ఉంది. అందంగా ఉండే కేతిక శర్మ సింపుల్ ఔట్ ఫిట్ నుంచి స్కిన్ షో చేసే ఔట్ ఫిట్ వరకు ఏ డ్రెస్‌లో కనిపించినా కూడా చూపు తిప్పుకోనివ్వని అందం ఈమెది అనడంలో సందేహం లేదు. హీరోయిన్‌గా ఈమెకు మంచి ఎంట్రీ దక్కడానికి కారణం ఈమె అందం అనడంలో సందేహం లేదు. ముందు ముందు ఈమె మరిన్ని సినిమాల్లో నటించే అవకాశాలు దక్కించుకోవచ్చు. తాజాగా ఈమె ఇన్‌స్టాలో షేర్ చేసిన ఈ వీడియో నెట్టింట వైరల్ అవుతోంది.

Printed, published and owened by GOTTIPARTHI MADHURI, printed at MADHURI OFFSET PRINTERS H.NO 3-133, BC colony yadagirigutta, dist : Yadadri Buvanagiri pin : 508115, Ts Publictions at Madhuri publications. Editor : GOTTIPARTHI BHASKER. RNA TELTEL /2021/80986